
ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్టం : 32.0 కనిష్టం : 21.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు


శనివారం 1 నవంబరు 2025



ఇదీ సీఎం రూట్ మ్యాప్ సర్..

ఇంటి వద్దకు ముఖ్యమంత్రి

నేడు పెద్దన్నవారిపల్లికి చంద్రబాబు





ఏర్పాట్లలో నిమగ్నమైన ఎమ్మెల్యే కందికుంట, ఎస్పీ, కలెక్టర్



- ముగ్గురికి ఇళ్ల వద్ద పింఛన్ పంపిణీ
- సమస్యలు తెలుసుకునేందుకు ప్రజా దర్బార్
- తెలుగుదేశం శ్రేణులతో ప్రత్యేక సమావేశం
- ఏర్పాట్లను పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం

కదిరి, పుట్టపర్తి టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు తలుపుల మండలం పెద్దన్నవారిపల్లికి శనివారం వస్తున్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ, ప్రజా దర్బార్, పార్టీ శ్రేణులతో జరిగే సమావేశాలలో ఆయన పాల్గొంటారు. గ్రామంలో 756 మందికి వివిధ రకాల పింఛన్లు అందుతున్నాయి. వీరిలో చింతలయ్య, రెడ్డెమ్మ, మేడా మల్లయ్య ఇళ్లకు వెళ్లి పింఛన్‌లను అందజేస్తారు. వారి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకుంటారు. ముఖ్యమంత్రి స్వయంగా తమ ఇళ్లకు వస్తున్నారని తెలుసుకుని వారు ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. ఆ క్షణాల కోసం ఆత్రంగా ఎదురుచూస్తున్నామని అన్నారు. తమకు ప్రభుత్వ పథకాలు అన్నీ అందుతున్నాయని, పక్కా ఇంటిని నిర్మించి ఇవ్వాలని కోరుతామని చింతలయ్య, రెడ్డెమ్మ అన్నారు. హంద్రీనీవా నీటి రాకతో తమ ప్రాంత రైతులు సంతోషంగా ఉన్నారని మేడా పుల్లయ్య అన్నారు.

నిరాడంబరం.. కట్టుదిట్టం

చంద్రబాబు పర్యటన నిరాడంబరంగా జరిగేలా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పరిశీలించారు. జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్, జేసీ మౌర్య భరద్వాజ్, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు. హెలిప్యాడ్, ప్రజా దర్బార్ వేదికను పరిశీలించారు. వీఐపీలు, గ్రామస్థులు, మీడియాకు ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేయించారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా మౌలిక వసతులు కల్పించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని

(మిగతా 6వ పేజీలో...)

సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రులు సత్యప్రసాద్, సవిత, కలెక్టర్





ఊసులాడి.. ఊడ్చేస్తారు..!

సోషల్ మీడియాలో కిలేడీ వెబ్‌సైట్ లింకులు

- ఓపెన్ చేస్తే అమ్మాయిల గొంతుకతో కాల్స్
- స్నేహం.. ప్రేమ.. పెళ్లి.. పేరిట బురిడీ
- ఏకాంతంగా కలుసుకుందామని మోసాలు
- మాయలో పడి మునుగుతున్న బాధితులు

హిందూపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వేదికపై వలపు వలలో పడి యువకులు, పెళ్లైనవారు విలవిలలాడుతున్నారు. స్నేహం, జోడీ పేరిట కనిపించే వెబ్‌సైట్ లింకులను క్లిక్ చేసి.. బ్యాంకు ఖాతాలను ఖాళీ చేసుకుంటున్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టా, వాట్సాప్.. ఇలా ఏదో ఒక మార్గంలో అమ్మాయిల గొంతుతో కేటుగాళ్లు వాయిస్ కాల్స్ చేసి బురిడీ కొట్టిస్తున్నారు. మరికొన్ని సందర్భాల్లో అమ్మాయిలే ఇలా మోసగిస్తున్నారు. 'కలుసుకుందాం.. పెళ్లి చేసుకుందాం.. మాట్లాడుకుందాం..' అని లైన్‌లో పెట్టి, మాయ చేసి డబ్బులు కాజేస్తున్నారు. అటువైపు నుంచి వినిపించేది అమ్మాయిల గొంతే అయినా, మాట్లాడుతోందని అమ్మాయే అన్న గ్యారెంటీ లేదు. అయినా పెళ్లికాని యువకులు, పెళ్లి అయిన పురుషులు కూడా ఉచ్చులో పడిపోతున్నారు. సరదాగా వెబ్‌సైట్‌లు తెరిచి.. బుట్టలో పడిపోతున్నారు. గుట్టుగా మాట్లాడుకుంటున్నారు. అటువైపు ఉన్నది అపరిచితులే అయినా.. అడిగిన వెంటనే వేలు.. లక్షలు ఇచ్చేస్తున్నారు. మోసపోయామని తెలుసుకున్నా.. పోలీసులను ఆశ్రయించడం లేదు. అవమానంగా భావించి, స్నేహితులు, కుటుంబ సభ్యులకు కూడా చెప్పుకోవడం లేదు. ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు చెలరేగిపోతున్నారు. నిత్యం వందలాది మందిచిన దోచుకుంటున్నారు. అతి చనువు వెనుక దాగిన అపాయాన్ని పసిగట్టుకుంటే ప్రమాదం తప్పదని పోలీసులు తరచూ హెచ్చరిస్తున్నా చైతన్యం రావడం లేదు.

ఊసులు ఆగిపోయి..

ప్రేమ, పెళ్లి, సహజీవనం పేరుతో విసిరే వలపు వలల వెనుక అమ్మాయిలే ఉన్నారో, కేటుగాళ్లు ఉన్నారో తెలియదు. మాట్లాడుతోంది మనిషో, ఏఐ బొమ్మనో తెలియదు. మంత్రాల్లాంటి మాటలు (మిగతా 6వ పేజీలో..)

టెట్ నుంచి మినహాయించాలి: ఫ్యాప్టో



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

కొత్తచెరువు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సర్వీసులో ఉన్న టీచర్లను టెట్ నుంచి మినహాయించేలా చట్టంలో మార్పులు తేవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలని డీఆర్‌ఓ సూర్యనారాయణరెడ్డి, డీఈఓ క్రిష్ణప్పకు ఫ్యాప్టో నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఫ్యాప్టో చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ గౌస్‌లాజం మాట్లాడుతూ ఆర్టీఈ చట్టం ఎన్‌సీటీఈ మార్గదర్శకాలను అనుసరించి 2010 మునుపు సర్వీసులో ఎంపికైన టీచర్లను కూడా టెట్ ఉత్తీర్ణత సాధించాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఉపాధ్యాయులు సర్వీసులో కొనసాగాలన్న, ప్రమోషన్లు పొందాలన్న రెండేళ్లలోపు టెట్ ఉత్తీర్ణత సాధించాలన్న సుప్రీంకోర్టు నిబంధనలతో ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. అన్ని అర్హతలతో, డీఎస్సీలో మెరుగైన ప్రతిభ చూపి ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన టీచర్లను ఇప్పుడు టెట్ రాసి ఉత్తీర్ణులు కావాలనడం దారుణమన్నారు. టెట్ మినహాయింపు కోరుతూ ఉపాధ్యాయ సంఘాలు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేసినట్లు తెలిపారు. దీనికి మద్దతుగా ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు శెట్టిపి జయచంద్రారెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, వెంకటనాయుడు, ఆర్ చంద్ర, ఎర్రిస్వామి, రాజగోపాల్, సుబ్బారెడ్డి, రాజశేఖర్, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా కలశ స్థాపన

- పులకించిన నెట్టికంటి అంజన్న భక్తులు

6

జిల్లాలో 25 కరువు ప్రభావిత మండలాలు

- 12 తీవ్ర కరువు మండలాలుగా గుర్తింపు



కొత్తచెరువు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 25 మండలాలను 2025 ఖరీఫ్‌కు సంబంధించి కరువు ప్రభావిత మండలాలుగా కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. వాటి వివరాలను శుక్రవారం విడుదల చేసింది. ఇందులో 12 తీవ్ర కరువు మండలాలుగా, 13 మధ్యస్థ కరువు మండలాలుగా పరిగణించింది. వాటిలో అగళి, అమడగూరు, గాండ్లపెంట, హిందూపురం, మడకశిర, ముదిగుబ్బ, నంబులపూలకుంట, ఓబులదేవరచెరువు, రామగిరి, రొళ్ల తలుపుల, తనకల్లులను తీవ్ర కరువు మండలాలుగా గుర్తించింది. అలాగే అమరాపురం, బత్తలపల్లి, బుక్కపట్నం, ధర్మవరం, గుడిబండ, కదిరి, కనగానిపల్లి, కొత్తచెరువు, లేపాక్షి, నల్లచెరువు, నల్లమాడ, పుట్టపర్తి, సోమందపల్లిలను మధ్యస్థ కరువు మండలాలుగా జాబితా విడుదల చేసింది. ఈ ప్రకటనతో కొంతమేర ఉపశమనం కలిగిందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

దిశ సమావేశం వాయిదా

పుట్టపర్తి టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన నేపథ్యంలో కలెక్టరేట్‌లో శనివారం జరగాల్సిన దిశ సమీక్ష సమావేశాన్ని వాయిదా వేసినట్లు జడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం నిర్వహించే తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు. ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు, గమనించాల్సిందిగా కోరారు.

దేశ సమైక్యతను కాపాడిన పటేల్

- ఎస్పీ సతీష్‌కుమార్
- ఘనంగా సర్దార్ జయంతి, అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ముగింపు



పటేల్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎస్పీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ సతీష్ కుమార్

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్వదేశీ సంస్థానాలన్నింటినీ భారత యూనియన్‌లో విలీనం చేసి దేశ సమైక్యతను కాపాడిన మహోన్నతుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని ఎస్పీ సతీష్‌కుమార్ కొనియాడారు. పటేల్ జయంతి, అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం ఉజ్వల ఫౌండేషన్ వద్ద రన్ ఫర్ యూనిటీని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ఉజ్వల ఫౌండేషన్ పెట్రోల్ బంకు వద్ద ప్రారంభమై జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణం వరకు సాగింది. అనంతరం పటేల్ చిత్రపటం వద్ద ఎస్పీ జ్యోతి ప్రజ్వలన గావించారు. పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితం ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా అక్టోబరు 31న రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. ప్రధాని మోదీ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా ఈ యూనిటీ రన్ నిర్వహిస్తూ ప్రజలలో ఐక్యతా స్ఫూర్తిని కలిగిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం దేశ సమగ్రత, ఐక్యత, భద్రతను కాపాడతాననే ప్రతిజ్ఞ సందేశాన్ని చదివి వినిపించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు శివాంజనేయులు, సురేష్, ఆర్ఐలు వలి మహేశ్, రవికుమార్, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు, ఆర్ఎస్సైలు వీరన్న, ప్రసాద్, ఏఆర్ పోలీసుసిబ్బంది, పాల్గొన్నారు.

సమైక్య భారత నిర్మాణానికి బీజేపీ కృషి

- జాతీయ ఐక్యతా ర్యాలీలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి

6

ఉద్యాన పథకాల ప్రయోజనం పొందండి

- మంత్రి సత్యకుమార్ యాదవ్

మట్టే మాణిక్యం !

- కొత్తపల్లి చెరువులో అక్రమ తవ్వకాలు
- సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు



కొత్తపల్లి చెరువులో ఏర్పడ్డ భారీ గుంతలు

సోమందేపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో చెరువు మట్టి దందా యథేచ్ఛగా సాగుతోంది. స్థానికంగా చేపడుతున్న గృహ, వాణిజ్య నిర్మాణాల కోసం, లేఅవుట్లలో భూమి చదును కోసం మట్టికి విపరీతమైన డిమాండ్ ఉంది. ఇదే అదనుగా కొందరు చెరువులోని మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టర్ మట్టి రూ.550నుంచి రూ.700కు విక్రయిస్తున్నారు. ఎవరికివారు సొంతంగా ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లను సమకూర్చుకుని నిర్మాణదారులతో ఒప్పందాలు చేసుకుంటున్నారు. 10లోడ్ల వరకు ఓరేటు, ఆపై మరోరేటు అవసరాన్ని బట్టి చేసుకున్న ఒప్పందం మేరకు పట్టపగలే చెరువు నుంచి మట్టిని తరలిస్తున్నారు. కొత్తపల్లి చెరువులో అక్రమ తవ్వకాల వల్ల 15నుంచి 20అడుగుల మేరకు గుంతలు పడ్డాయి. రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖ అధికారులు, పోలీసులు రాజకీయ ఒత్తిళ్లతో ఉదాశీనంగా ఉండటం అక్రమార్కులకు కలిసి వస్తోంది. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు చాలా చెరువుల్లో నీరు చేరింది. దీంతో అక్రమార్కులు కొండలు, గుట్టలను టార్గెట్ చేస్తున్నారు. అభివృద్ధి పనుల పేరిట మట్టిని తరలించుకెళ్తున్నారు. రాయల్టీ, రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖాధికారులు గట్టి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఇరిగేషన్‌శాఖ ఏఈ వినోద్‌కుమార్‌ను వివరణ కోరగా సమస్య తన దృష్టికి రాలేదని, సిబ్బందిని పంపించి తగు చర్యలు చేపడతామని తెలిపారు.



మట్టి తవ్వుతున్న ఎక్స్‌కవేటర్ (ఫైల్)

సమైక్య భారత నిర్మాణానికి బీజేపీ కృషి

● జాతీయ ఐక్యతా ర్యాలీలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు, విద్యార్థులు

ధర్మవరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సమైక్య భారత నిర్మాణానికి బీజేపీ కృషిచేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు శుక్రవారం ధర్మవరంలో జాతీయ ఐక్యతా ర్యాలీ నిర్వహించారు. గాంధీ నగర్ మారుతీ రాఘవేంద్రస్వామి కల్యాణ మండపం నుంచి కాలేజ్ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. కళాశాల, పాఠశాలల విద్యార్థులు, వ్యాపార వేత్తలు, పురప్రముఖులు, సామాజిక సేవకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా సందిరెడ్డి మాట్లాడుతూ... వల్లభాయ్ పటేల్ దేశసమైక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. అనంతరం పోతుకుంటలో ఉన్న పటేల్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు, ప్రోగ్రామ్ ఇన్‌చార్జ్ అమర దేవేంద్ర, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబుళేశు, పట్టణ, రూరల్ అధ్యక్షులు జింకా చంద్ర, గొట్లూరు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌లో ఇరుక్కున్న 108



ట్రాఫిక్‌లో ఇరుక్కుయిన 108 అంబులెన్స్

ధర్మవరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం 108 అంబులెన్స్ ట్రాఫిక్ మధ్యలో అరగంటకుపైగా ఇరుక్కుపోయింది. సర్దార్ పటేల్ 150వ జయంతి సందర్భంగా బీజేపీ నాయకులు కాలేజ్ సర్కిల్‌లో సమావేశం నిర్వహించారు. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఈ ట్రాఫిక్‌లో 108 అంబులెన్స్ ఇరుక్కుపోయింది. ఎంత సేపు సైరన్ కొట్టినా ఎవరూ దారివ్వలేదు. ఇది చూసిన ప్రజలు కనీసం అంబులెన్స్‌కు దారి ఇవ్వకుండా రోడ్డుపై కార్యక్రమాలు నిర్వహించుకోవడం ఏమిటని చర్చించుకున్నారు. సమావేశమయ్యాక అంబులెన్స్‌కు దారి వదిలారు.

ఉద్యాన పథకాల ప్రయోజనం పొందండి

● మంత్రి సత్యకుమార్‌యాదవ్

ధర్మవరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న ఉద్యాన శాఖ పథకాల నుంచి నియోజకవర్గ రైతులు పూర్తి స్థాయిలో ప్రయోజనం పొందాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చి, రైతుల ఆదాయం పెంచడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఇందు కోసం ఫాం పాండ్లు, ప్యాక్ హౌస్ పథకాలకు నవంబరు 5వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి రైతు స్థానిక రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫాం పాండ్ల పథకం కింద ప్రభుత్వం రైతులకు 50 నుంచి 75 శాతం వరకు సబ్సిడీ అందిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ప్రకటనలో కోరారు.

రైల్వే ట్రాక్‌మన్ బలవన్మరణం



అనిల్‌కుమార్ నాయక్(ఫైల్)

కొత్తచెరువు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రశాంతి రైల్వే క్వార్టర్స్‌లో నివాసముంటున్న అనిల్‌కుమార్‌నాయక్(38) అనే రైల్వే ట్రాక్‌మన్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చెన్నేకొత్తపల్లి మండలం గంగినేపల్లి తండాకు చెందిన అనిల్‌కుమార్ నాయక్ స్థానికంగా రైల్వే ట్రాక్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతడు గురువారం భార్య అనితాబాయితో కలిసి స్వగ్రామానికి వెళ్లాడు. అయితే విధి నిర్వహణలో భాగంగా గురువారం రాత్రి రైల్వే క్వార్టర్స్‌లోని ఇంటికి వచ్చాడు. తోటి ఉద్యోగి శుక్రవారం ఉదయం అనిల్‌కుమార్‌నాయక్ ఇంటి వద్దకు వెళ్లి పిలిచినా ఎంత సేపటికి పలుక లేదు. దీంతో కిటికీలో నుంచి చూడగా ఉరికివేలాడుతూ కనిపించాడు. దీంతో కొత్తచెరువు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనికుమార్ నాయక్ గతంలో ప్రమాదానికి గురికా వడంతో కాలికి రాడ్లు వేశారు. అవి నొప్పిగా ఉండటంతో తరచూ బాధపడుతుండేవాడు. కాలి నొప్పి భరించలేక శుక్రవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి భార్య అనితా బాయి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు సాత్విక్ అనే కుమారుడు ఉన్నాడు.

రేషన్ కార్డు ఉంటే ఉచిత వైద్యం

ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి అసోసియేట్ డైరెక్టర్ రాజశేఖర్



మాట్లాడుతున్న రాజశేఖర్, మాజీ మంత్రి రఘువీరారెడ్డి

మడకశిర రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డు ఉన్న పేదలకు ఉచిత కంటి పరీక్షలు, ఆపరేషన్లు నిర్వహిస్తామని ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి అసోసియేట్ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో దివంగత శ్రీరామరెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో నిర్మించిన ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిని శుక్రవారం ఆయన మాజీమంత్రి రఘువీరారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూ.ఆరు కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఆసుపత్రిని మూడో తేదీ ప్రారంభిస్తామన్నారు. ఆంధ్ర, తెలంగాణ, ఒడిసా 24 ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. నీలకంఠాపుం గ్రామంలో 25 వది ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అన్నీ రకాల కంటి పరీక్షలు, ఆపరేషన్లు నీలకంఠాపురంలోనే నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్, కేటీ శ్రీధర్ స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

జిల్లా చెస్ క్రీడాకారుడికి అంతర్జాతీయ పతకం



అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో జిల్లా చెస్ క్రీడాకారుడికి రజత పతకం దక్కింది. మంగోలియా దేశంలో నిర్వహించిన 19వ ఏషియన్ స్కూల్స్ చెస్ చాంపియన్‌షిప్-2025 పోటీల్లో భారత్ తరఫున జిల్లా క్రీడాకారుడు శామ్యూల్ స్టీఫెన్ నోబుల్ పాల్గొన్నాడు. ఈ పోటీల్ల అత్యంత ప్రతిభ కనబరిచిన శామ్యూల్ స్టీఫెన్ నోబుల్‌కు ద్వితీయ స్థానం దక్కింది. రజత పతకం సాధించిన క్రీడాకారుడిని పలువురు అభినందించారు.

ఊసులాడి.. ఊడ్చేస్తారు..!



(5వ పేజీ తరువాయి)

వినిపించగానే ఇక అమ్మాయి దొరికేసింది అన్నట్లు బుట్టలో పడిపోతున్నారు. డబ్బులు కాజేసిన తరువాత అక్కడి నుంచి ఊసులు ఆగిపోగానే అవమాన భారంతో కుమిలిపోతున్నారు. స్నేహం పేరిట మొదలు పెట్టి మాటల్లో ఎక్కడెక్కడికో తీసుకుపోతున్నా అనుమానించడం లేదు. దీనికి కారణం.. సోషల్ మీడియాలో అందమైన యువతుల ఫొటోలతో కేటుగాళ్లు ఖాతాలను నిర్వహించడమే. హిందూపురం ప్రాంతానికి చెందిన ఓ మహిళ కొన్నాళ్లపాటు ఇదే ప్రాంతానికి చెందిన కొందరికి ఫోన్ కాల్స్ చేసి.. ట్రాప్‌లో పెట్టి దోచేసింది. చివరకు కటకటాలపాలైంది.

చుక్కలు చూపిస్తారు

ట్రాప్‌లో పడినవారికి సైబర్ నేరగాళ్లు చుక్కలు చూపుతున్నారు. ఏకాంతంగా కలుద్దామని పిలవడం, అక్కడికి వెళ్లగానే తమ కుటుంబ సభ్యులకు ఆరోగ్యం బాగా లేదనో, ప్రమాదం జరిగిందనో మాయ మాటలు చెప్పడం పరిపాటిగా మారుతోంది. ఆ మాటలను నమ్మగానే వైద్యం పేరిట డబ్బులు గుంజుతున్నారు. మరికొందరు నగ్నంగా మార్చి వీడియో కాల్స్ ద్వారా రికార్డు చేసి బెదిరింపులకు దిగుతున్నారు. ఆ వీడియోలను బయట పెడతామని బెదిరించి డబ్బులు గుంజుతున్నారు. అందుకే సోషల్ మీడియా ఖాతాలు, అపరిచితుల కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

కలుసుకుందాం రా..!

హిందూపురం పట్టణానికి చెందిన ఓ ప్రైవేట్ కంపెనీ ఉద్యోగికి సోషల్ మీడియాలో ఓ వెబ్‌సైట్ లింక్ కనిపించింది. దాన్ని క్లిక్ చేసిన కాసేపటికి ఓ యువతి నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. ఆమె సూచనతో రూ.1500 చెల్లించి ఆ వెబ్‌సైట్‌లో సభ్యుడిగా చేరాడు. అక్కడ సరైన జోడీ కోసం వెతుకుతుండగా మరో యువతి ఫోన్‌చేసి పలకరించింది. ఇద్దరి మధ్య కొన్నాళ్ల చాటింగ్, వాట్సప్, ఫోన్‌కాల్స్ కొనసాగాయి. అలా ఫోన్‌లో దగ్గరయ్యారు. 'మనం కలుసుకుందాం. ఎక్కడైనా రూమ్ బుక్ చెయ్' అని ఆమె ఊరించింది. ఆ యువకుడు మొహమాటానికి పోయాడు. 'వద్దులే..' అన్నాడు. దీంతో ఆమెనే చొరవ తీసుకుంది. 'బెంగళూరులో ఓ హోటల్ గది బుక్ చేస్తున్నా.. రూ.10 వేలు' అంది. మనోడు అలా వలలో పడిపోయాడు. ఆమె బ్యాంకు ఖాతాలో రూ.10 వేలు జమ చేశాడు. బెంగళూరుకు చేరుకుని, ఆమె బుక్ చేసినట్లు చెప్పిన హోటల్ వద్దకు వెళ్లాడు. అక్కడ ఆమె కనిపించలేదు. ఫోన్ చేస్తే.. 'అక్కడ వద్దు.. ఇంకో చోటకు రా..' అని పిలిచింది. అప్పటికే సమయం ముగియడంతో 'నాకు వేరే పని ఉంది. ఇంకోసారి కలుద్దాం..' అని చెప్పి తిరుగు ముఖం పట్టాడు. ఆ తరువాత కూడా ఫోన్ సంభాషణలు కొనసాగాయి. ఊరించి.. ఊరించి.. రూ.2 లక్షల దాకా కాజేసింది ఆమె. చివరకు మోసపోయానని అర్థమైంది. బయటకు చెబితే చులకన అవుతానని మౌనంగా ఉండిపోయాడు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ సంఘటన జరిగింది.

పెళ్లి చేసుకుందాం..



సోమందేపల్లికి చెందిన ఓ చేనేత కార్మికుడు వారం క్రితం ఫేస్‌బుక్ చూస్తుండగా ఓ వెబ్‌సైట్ దర్శనమిచ్చింది. దాన్ని ఓపెన్ చేయగానే ఓ యువతి ఫోన్‌చేసి పలకరించింది. మాటలు కలిపింది. 'నాకు పెళ్లి కాలేదు. చేనేత కార్మికులు అంటే నాకు చాలా ఇష్టం. ఓ చేనేత కార్మికుడిని పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నా..' అంది. ఇదంతా నిజమేనని ఆ చేనేత కార్మికుడు అనుకున్నాడు. 'మీరూ చేనేత కార్మికుడే కదా..? ఓకే అంటే త్వరలోనే మనమిద్దరం పెళ్లి చేసుకుందాం..' అని నమ్మించింది. అలా లైన్‌లో పెట్టి.. ఖర్చుల పేరిట రూ.లక్ష దాకా లాగేసుకుంది. 'ఇంక పెళ్లి చేసుకుందాం రా..' అని కార్మికుడు ఆహ్వానించగానే.. 'వచ్చేస్తున్నా..' అని ఓ తేదీ చెప్పింది. ఆ రోజు నుంచి ఫోన్ కాల్స్ ఆగిపోయాయి. ఆ యువతి వాట్సప్ వాయిస్ కాల్స్ కాకుండా, ఇన్‌స్టా వాయిస్ కాల్స్ చేసి బురిడీ కొట్టించింది.

సమాచారం ఇవ్వండి..



అందమైన అమ్మాయిల ఫొటోలు పంపినా, మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలు పంపి డబ్బు డిమాండ్ చేసినా భయపడకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలి. బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతాం. సోషల్ మీడియాలో పెట్టే అందమైన అమ్మాయిల ఫొటోలను చూసి మోసపోకూడదు. ఇలాంటి మోసాలు తరచూ జరుగుతున్నా ప్రజలు మేల్కొకపోవడం బాధాకరం.

- మహేష్, డీఎస్పీ, హిందూపురం

ఇంటి వద్దకు ముఖ్యమంత్రి

(5వ పేజీ తరువాయి)

అధికారులను కలెక్టర్, ఎస్పీ ఆదేశించారు.

ముఖ్యమంత్రి పర్యటన వివరాలు

- ఉదయం 11 గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి హెలిక్యాప్టర్‌లో బయలుదేరుతారు.
- 11:30 గంటలకు పెద్దన్నవారిపల్లి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 11:40 గంటల వరకు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు స్వాగతం పలుకుతారు.
- 11:45 గంటలకు హెలిప్యాడ్ నుంచి గ్రామంలోకి చేరుకుంటారు.
- 12:15 గంటల వరకు గ్రామంలో లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ అందజేస్తారు.
- 12:20 గంటలకి గ్రామ సమీపంలోని ప్రజా వేదిక వద్దకు వెళతారు
- 01:50 గంటల వరకు ప్రజావేదికలో పాల్గొంటారు.
- ఆ తరువాత 2:30 గంటల వరకు విరామం
- 2:35 గంటలకు పెద్దన్నవారిపల్లికి సమీపంలో ఏర్పాటు చేసిన పార్టీ శ్రేణుల సమావేశ వేదిక వద్దకు చేరుకుంటారు.
- సాయంత్రం 4 గంటల వరకు శ్రేణుల సమావేశంలో పాల్గొంటారు.
- ఆ తరువాత హెలికాప్టర్‌లో తిరుగు ప్రయాణమౌతారు.

నేడు పింఛన్ల పంపిణీ

జిల్లాలో శనివారం 2,64,802 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. వీరందరికీ రూ.115.92 కోట్లు పంపిణీ చేస్తారు. పింఛన్ సొమ్మును శనివారం తీసుకోని వారికి సోమవారం అందజేస్తామని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు.

నాకు ఇల్లు కావాలి..



నాకు పింఛన్ వస్తోంది. నెల నెల రూ.4 వేలు అందుతోంది. ఈ నెల స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే మా ఇంటికి పింఛన్ అందివ్వడానికి వస్తున్నారు. ఎంతో ఆనందంగా ఉంది. నేను ఒక్కడినే ఉంటాను. నా ఇల్లు కూలిపోయే స్థితిలో ఉంది. ఎప్పుడు పడిపోతుందో అనే భయం వెంటాడుతోంది. ముఖ్యమంత్రి మా ఇంటికి వచ్చినప్పుడు ఇల్లు కావాలని అడుగుతాను.

- చింతలయ్య, పెద్దన్నవారిపల్లి

సంతోషంగా ఉంది..

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మా ఇంటికి వచ్చి స్వయంగా పింఛన్ ఇస్తారని అధికారులుచెప్పారు. ఎంతో ఆనందంగా ఉంది. ప్రభుత్వ పథకాలు అన్నీ అందుతున్నాయి. గతంలో పింఛన్ రూ.3 వేలు వచ్చేది. ఇప్పుడు రూ.4 వేలు వస్తోంది. ఒకటో తేదీనే పింఛన్ ఇస్తున్నారు. రేషన్ బియ్యం అందుతున్నాయి. మా ప్రాంతానికి హంద్రీనీవా నీళ్ళు రావడంతో రైతులు అనందంగా ఉందన్నారు.

- మేడా మల్లయ్య, పెద్దన్నవారిపల్లి



అన్ని పథకాలూ అందుతున్నాయి..



నాకు భర్త లేదు. నెలనెలా పింఛన్ వస్తోంది. మూడు గ్యాస్ సిలెండర్‌లు ఉచితంగా అందుకున్నాను. టీ హోటల్ నడుపుకుంటున్నాను. సరుకుల కోసం కదిరి, తలుపులకు ఉచితంగా ఆర్టీసీ బస్సులో వెళ్లి వస్తున్నాను. అన్ని పథకాలు అందుతున్నాయి. కానీ ఉండటానికి సరైన ఇల్లు లేదు. ముఖ్యమంత్రి మా ఇంటికి వచ్చినప్పుడు ఇల్లు కావాలని అడుగుతాను. ఆయన రాక కోసం ఎదురుచూస్తున్నాను.

- రెడ్డెమ్మ, పెద్దన్నవారిపల్లి

జిల్లా చెస్ క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన చెస్ క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా చెస్ బాల, బాలికల క్రీడాకారులను ఎంపిక చేశారు. స్థానిక న్యూటౌన్ బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎస్‌జీఎఫ్ అండర్-19 బాల, బాలికల చెస్ క్రీడాకారుల ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. బాలుర విభాగంలో అచ్యుతరామరాజు, శర్వాన్‌తేజ్, ఎస్ కృష్ణసురేంద్ర, వినీత్, శ్రీధర్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో అనన్య, శ్రీహా, లాలిత్య, సుశాన్‌క్లారా, లక్ష్మీప్రణతి ఎంపికయ్యారు. వీరు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో టోర్నమెంట్ చీఫ్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్, హుస్సేన్‌ఖాన్, మల్లికార్జున, పీడీలు రామకృష్ణ, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గిరిజన స్వాభిమాన ఉత్సవాలు

అనంతపురం విద్య, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు పక్షంరోజులు పాటు జిల్లాలో గిరిజన స్వాభిమాన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆశాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి ఈనెల15వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. జిల్లాకేంద్రంలోని నవోదయకాలనీలో ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో శనివారం ఈస్వాభిమాన ఉత్సవాలు ప్రారంభిస్తామన్నారు.

ఓసీలను విస్మరిస్తే పన్నులు చెల్లించం

● ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న కరుణాకర్‌రెడ్డి

అనంతపురం అర్బన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఓసీలను విస్మరిస్తే ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా సహాయనిరాకరణ చేస్తామని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక లలితకళాపరిషత్‌లో జిల్లా విద్యార్థి యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఓసీ విద్యార్థి యువ గర్జన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అత్యధిక శాతం పన్నులు రూపంలో చెల్లించేది ఓసీ వర్గాలకు చెందిన వ్యాపారవేత్తలు, పారిశ్రామిక వేత్తలేనన్నారు. అయినా నిరుపేద ఓసీల అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం శోచనీయమన్నారు. జాతీయ స్థాయిలో ఓసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, రూ.లక్ష కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అగ్రవర్ణ పేదలకు మేజర్ జనరల్ సిన్హా నివేదిక మేరకు ఇతర వర్గాలతో సమానంగా ప్రభుత్వ పథకాలు అమలు చేయాలన్నారు. ఓసీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ టెట్‌లో అర్హత మార్కులను ఓసీలకు 90 నుంచి 75కి తగ్గించాలన్నారు. పోటీ పరీక్షలకు వయోపరిమితిని నడలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంజునాథ్ చౌదరి, జిల్లా అధ్యక్షుడు రాము, కార్యదర్శి మాధవరెడ్డి, రాయలసీమ బలిజ సంఘం సహాయ కార్యదర్శి సూరి, ఓసీ ఎలక్ట్రిసిటీ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీధర్, ఆర్యవైశ్య ట్రస్టు అధ్యక్షుడు రమేష్‌బాబు, నాయకులు సత్యనారాయణ శర్మ, రెడ్డి జేఏసీ నాయకులు శేషాద్రిరెడ్డి, సురేష్‌రెడ్డి, హనుమంతరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఓబిరెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ క్రీడలను విజయవంతం చేయండి

● కలెక్టర్ ఆనంద్



బెలూన్ ఎగురవేస్తున్న కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఏడో రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. నగరంలోని కృష్ణ కళామందిర్‌లో శుక్రవారం నిర్వహించిన ఏడో రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు-2025కు సంబంధించిన బెలూన్ ఎగురవేసే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో జరిగే రెవెన్యూ క్రీడలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, రామ్మోహన్, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దివాకర్‌బాబు, సెక్రటరీ సోమశేఖర్, తహసీల్దార్ మోహన్‌కుమార్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సెక్రటరీ సంజీవరెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, రెవెన్యూ క్రెడిట్ సొసైటీ ట్రెజరర్ సంజీవరాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కలశ స్థాపన

● పులకించిన నెట్టికంటి అంజన్న భక్తులు ● హాజరైన ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు



అలంకారాలలో స్వామివారు.. తూర్పు గోపుర కలశ స్థాపనలో ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, కాలవ శ్రీనివాసులు



గుంతకల్లు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కసాపురంలో నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయ రాజగోపురాల కలశ స్థాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని అన్ని గోపురాలపై శుక్రవారం ఉదయం 11 గంటలా 11 నిమిషాలకు ఏకకాలంలో వేద మంత్రోచ్చారణల మధ్య కలశాలను స్థాపించారు. ఈఓ విజయరాజు ఆధ్వర్యంలో వేద, రామాయణ పారాయణం, ఆరాధనలు, ద్వారతోరణ పూజ, ఉప కుంభారాధన, చతుస్థానార్చన, మూల మంత్ర హవనం, మన్యుసూక్త హవనం, పంచ సూక్త హవనం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తన కుటుంబ సభ్యులతో కలిసి క్రతువుల్లో పాల్గొన్నారు. తూర్పు గోపుర శిఖర కలశ స్థాపనలో ఎమ్మెల్యేలు కాలవ, గుమ్మనూరు పాల్గొన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, పరిటాల సునీత, బండారు శ్రావణిశ్రీ, పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, గుంతకల్లు మునిసిపల్ చైర్‌పర్సన్ ఎన్ భవాని, మాజీ చైర్మన్ ఎన్ రామలింగప్ప, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు తదితరులు హాజరయ్యారు.





గోపురాలను సందర్శించి పూజ చేస్తున్న ఎంపీ అంబికా, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్

వర్షానికి కూలిన పూరిల్లు

● పరిహారం కోసం తహసీల్దార్‌కు వినతి



వర్షానికి కూలిన పూరిల్లు

తనకల్లు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బంగారువాండ్లపల్లికి చెందిన రామప్ప పూరి గుడిసె ఇటీవల కురిసిన వర్షాలకు తడిసి గురువారం రాత్రి కూలిపోయింది. అతడి కుటుంబ సభ్యులంతా బెంగళూరులో ఉండడం, అతడు రాత్రి బయట పడుకుని ఉండడంతో ఎవరికీ ఎటు వంటి హానీ జరుగలేదు. అయితే ఇంట్లో ఉన్న తిండి గింజలు, వంట సామగ్రి, బట్టలు, వ్యవసాయ పనిముట్లు ధ్వంసమయ్యాయి. దీంతో రూ. లక్ష ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు రామప్ప ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి, పక్కాగృహం మంజూరు చేయాలని కోరాడు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ షాబుద్దీన్‌కు వినతి పత్రం సమర్పించాడు. ప్రస్తుతం పడిపోయిన ఇంటికి పైన పట్టకట్టుకొని ఉంటున్నాడు.


స్వాగతం - సుస్వాగతం
నేడు ఎన్టీఆర్ భరోసా పథకం
పెన్షన్లు అందించడానికి
కదిరి నియోజకవర్గం,
తలుపుల మండలం
పెద్దన్నవారిపల్లికి విచ్చేస్తున్న
గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారాచంద్రబాబు నాయుడు గారికి
స్వాగత సుమాంజలులతో..
సతీష్ చౌదరి
టీడీపీ నాయకులు, నల్లచెరువు మండలం, కదిరి, శ్రీసత్యసాయి జిల్లా.


స్వాగతం - సుస్వాగతం
నేడు ఎన్టీఆర్ భరోసా పథకం పెన్షన్లు
అందించడానికి
కదిరి నియోజకవర్గం, తలుపుల మండలం
పెద్దన్నవారిపల్లికి విచ్చేస్తున్న
గౌరవ ముఖ్యమంత్రి
శ్రీ నారాచంద్రబాబు నాయుడు
గారికి
స్వాగత సుమాంజలులతో..
పి.వి.పవన్ కుమార్ రెడ్డి
రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి,
తెలుగుదేశం పార్టీ
కదిరి నియోజకవర్గం.


హృదయపూర్వక
స్వాగతోత్సవం..
నేడు ఎన్టీఆర్ భరోసా పథకం
పెన్షన్లు అందించడానికి
కదిరి నియోజకవర్గం,
తలుపుల మండలం
పెద్దన్నవారిపల్లికి విచ్చేస్తున్న
గౌరవ ముఖ్యమంత్రి
శ్రీ నారాచంద్రబాబు నాయుడు గారికి
స్వాగత సుమాంజలులతో..
కదిరి నియోజకవర్గ ప్రజలు
శ్రీసత్యసాయి జిల్లా.


స్వాగతం - సుస్వాగతం
నేడు ఎన్టీఆర్ భరోసా పథకం పెన్షన్లు అందించడానికి
కదిరి నియోజకవర్గం, తలుపుల మండలం
పెద్దన్నవారిపల్లికి విచ్చేస్తున్న గౌరవ ముఖ్యమంత్రి
శ్రీ నారాచంద్రబాబు నాయుడు గారికి
స్వాగతం.. సుస్వాగతం..
ఇట్లు...
కదిరి నియోజకవర్గ ప్రజలు
శ్రీసత్యసాయి జిల్లా.

న్యూస్ బాక్స్

పెద్దమ్మ ఆలయంలో సహస్ర దీపోత్సవం



పెద్దమ్మ ఆలయంలో వెలిగించిన దీపాలు

ధర్మవరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాలేవీధిలో వెలసిన పెద్దమ్మ దేవత ఆలయంలో కార్తీక మాసం శుక్రవారం సందర్భంగా సహస్ర దీపోత్సవాన్ని బుగ్గవంశస్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా మూల విరాట్‌ను పట్టువస్త్రాలు, వివిధ రకాల పూలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం మహిళలు దీపాలు వెలిగించి లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం చేశారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

అధ్వానంగా రహదారి

● ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ధర్మవరం రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణం నుంచి మామిళ్లపల్లికి వెళ్లే రహదారి గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారైంది. పోతుకుంట బృందావన కాలనీ పోలీస్‌గెస్ట్ హౌస్ వద్ద నుంచి ధర్మవరంలోకి రహదారి అంతా దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కాలంలో ఈ రహదారిపై ప్యాచ్ వర్కులు చేసినా నెలలు గడవకముందే రహదారి అంతా ఛిద్ర మవుతోందని ఆ రహదారి గుండా ప్రయాణించే గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఇంత అధ్వానంగా ఉంటే ఎలా ప్రయాణం చేసేది? అంటూ ప్రశ్నిస్తున్నారు. నిత్యం ఈ రహదారి గుండా ఆటోలు, ద్విచక్రవాహనాలతో పాటు పలు వాహనాలు మామిళ్లపల్లి వద్ద జాతీయరహదారిలోకి వెళుతుంటాయి. ఈ గుంతలరోడ్డులో ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి గాయాల పాలవుతున్నారు. రోడ్డు అధ్వానంగా ఉండటం పట్ల పలువురు వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రహదారిలో ఉన్న గుంతలను పూడ్చివేసి ప్రయాణానికి ఇబ్బంది లేకుండా చేయాలని వాహనదారులు, గ్రామస్థులు కోరుతున్నారు.



బృందావనకాలనీ పోలీస్ గెస్ట్ హౌస్ వద్ద రోడ్డు ఇలా

సెక్యూరిటీ వింగ్ సీఐ బాధ్యతల స్వీకరణ




బాధ్యతలు చేపడుతున్న సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతినిలయం సెక్యూరిటీ వింగ్ సీఐగా బాలసుబ్రహ్మణ్యంరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన పట్టణంలో సీఐగా విధులు నిర్వర్తించారు, అనంతరం స్పెషల్‌బ్రాంచ్‌సీఐగా పని చేశారు. బాబా శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో ప్రశాంతి నిలయంలో భద్రత వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. సెక్యూరిటీ వింగ్ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు.

సీఎం ప్రజావేదికకు తరలిరండి

● టీడీపీ నాయకులు

గాండ్లపెంట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తలుపుల మండలం పెద్దన్నవారిపల్లిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం వస్తున్నారని టీడీపీ మండల కన్వీనర్ కొండయ్య తెలిపారు. ఆయన మండల కేంద్రంలో శుక్రవారం మాట్లాడారు. సీఎం నిర్వహించే ప్రజావేదిక కార్యక్రమానికి మండలంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు క్లస్టర్ ఇన్‌చార్జ్ గొడ్డెలగల ప్రసాద్ పాల్గొన్నారు.



మూడో రోజు కొనసాగిన డివిజన్ స్థాయి క్రీడలు



జిల్లా స్థాయి కీడ్రా పోటీలకు ఎంపికైన బాలికలు, బాలురు

కదిరి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్టీఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మూడో రోజు ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్-14, 17 బాల బాలికల క్రీడల పోటీలు కొనసాగా యి. ఇందులో హైజంప్, లాంగ్ జంప్, 100, 200, 400, 800, 1500 మీటర్ల పరుగుపందెంతో పాటు డిస్క్ త్రో, షాట్‌పుట్, జావ్లింగ్ త్రో సంబంధిత క్రీడల పోటీలు నిర్వహించారు. వాటిలో ప్రథమ, ద్వితీయ స్థాయి ప్రతిభ కనబరచిన వారిని ఎంపిక చేసి జిల్లా స్థాయి పోటీలకు పంపుతున్నామని డివిజన్ కోఆర్డినేటర్ లస్కర్‌నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ వెంకటాచలాన్ని వివిధ మండలాల పాఠశాలల పీడీలు సన్మానించారు.

క్రీడలలో రాణించిన రెయిన్‌బో విద్యార్థులు



ప్రతిభ కనబరచిన క్రీడాకారులతో పాఠశాల సిబ్బంది

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఇటీవల మండల స్థాయిలో జరిగిన క్రీడా పోటీలలో రెయిన్‌బో పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు ప్రతిభ కనబరిచి డివిజన్ స్థాయికి ఎంపికైనట్లు ఆ పాఠశాల హెడ్‌మాస్టర్ జయసింహారెడ్డి శుక్రవారం తెలిపారు. బాలికల అండర్-17 ఖోఖో, కబడ్డీ విభాగాల్లో, అథ్లెటిక్స్‌తో పాటు, జావెలింగ్ త్రో, లాంగ్ జంప్, బాడ్మింటన్, చెస్, 100 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ఈ సందర్భంగా మండల స్థాయి అండర్-17 ఖోఖో బాలికల విభాగంలో విన్నర్స్‌గా నిలిచిన విద్యార్థినీ, విద్యార్థులను ఆయనతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ట్రాక్టర్ కింద పడి మహిళ మృతి



రాములమ్మ(ఫైల్)

ధర్మవరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద ఓ మహిళ శుక్రవారం రాత్రి ట్రాక్టర్ కిందపడి అక్కడికక్కడే మృతిచెందింది. మండల పరిధిలోని బిల్వంపల్లికి చెందిన కొత్తపల్లి రాములమ్మ(55) వ్యవసాయ కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తోంది. ఆమె భర్త రామకృష్ణ మూ డేళ్ల క్రితం మృతిచెందాడు. ఆమె శుక్రవారం పనినిమిత్తం అనంతపురం వెళ్లి తిరిగి రాత్రి స్వగ్రామానికి వెళ్లడానికి ధర్మవరంలో ఆటో కోసం కూరగాయల మార్కెట్ వద్ద నడుచుకుంటూ వెళ్తోంది. ఆ సమయంలో కరెంటు లేకపోవడంతో వెనుక వైపు నుంచి వచ్చిన ట్రాక్టర్ ఆమెను ఢీకొంది. దీంతో ఆమె ట్రాక్టర్ వెనుక టైరు కిందపడి అక్కడి కక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలిం చారు. మృతురాలి వివరాలను స్థానికుల ద్వారా తెలుసుకుని ఆమె కుటుంబసభ్యులకు సమాచా రం అందించారు. రాములమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ట్రాక్టర్ డ్రైవర్ పరారిలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వారికి వివాహాలు అయ్యాయి.


ద్విచక్రవాహనం ఢీకొని మరొకరు

ధర్మవరం రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపల్లిక్రాస్ వద్ద 44వ జాతీయ రహదారిలో శుక్రవారం ద్విచక్రవాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. కనగానపల్లి మండలం దాదులూరుకు చెందిన జర్రిపోతుల నాగేంద్ర(36) అనే వ్యక్తి సీతారాంపల్లి క్రాస్‌లో ఓ అంగడి ఏర్పాటుచేసుకుని జీవనం సాగిస్తున్నాడు. అతడు గురువారం రాత్రి క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా అనంతపురం వైపు నుంచి చెన్నేకొత్తపల్లికి వెళుతున్న ఓ ద్విచక్రవాహనం నాగేంద్రను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగేంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబీకులు, బంధువులు బెంగుళూరుకు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ శుక్ర వారం సాయంత్రం మృతిచెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య సరోజమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

ధర్మవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించి, తనపై దాడి చేశారని స్థానిక లక్ష్మీ చెన్నకేశవపురానికి చెందిన సాకే రాజ శుక్రవారం షాహెన్షా అనే వ్యక్తిపై ఫిర్యాదు చేసినట్టు వన్ టౌన్ పోలీసులు తెలిపారు. పట్టణ సమీపంలోని లక్ష్మీ చెన్నకేశవపు రంలో బెంగళూరు బేకరి వద్ద సాకే రాజ ఉన్నాడు. బీజేపీ నాయకుడు జమీర్ కుమారుడు షాహెన్షా అక్కడికి అనుచరులతో వచ్చాడు. సాకే రాజను చూసి అనవసరంగా కులం పేరుతో దూషించడంతో పాటు కట్టెతో దాడి చేశాడు. ఈ ప్రకారం సాకే రాజ ఇచ్చిన ఫిర్యాదు మే రకు షాహెన్షాతో పాటు మరికొందరిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.





న్యూస్ బాక్స్

గుడి నిర్మాణానికి భూమి పూజ



హోమాలు చేస్తున్న వేద పండితులు

అమడగూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లోకోజిపల్లిలో అభయాంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి గ్రామస్థులు, దాతల ఆధ్వర్యంలో శుక్రవారం భూమి పూజ చేశారు. దాదాపు రూ. 2కోట్లకు పైగా ఖర్చులో ఆలయం నిర్మిస్తున్నట్లు గ్రామస్థులు, దాతలు తెలిపారు. గుడి నిర్మాణం తరువాత గ్రామంలో ఆసుపత్రి, గ్రంథాలయం నిర్మిస్తా మని వారు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

నల్లమాడ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి శనివారం మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్ తెలిపారు. మండలంలోని చారుపల్లి, రెడ్డిపల్లి, వంకరకుంట, కొత్తపల్లి తండా, వేళ్ళమద్ది, కొండ కింద తండా గ్రామాలలో వారు పింఛన్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని టీడీపీ నాయకు లు, కార్యకర్తలు, కూటమి నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

మానవ హక్కుల పరిరక్షణపై అవగాహన

నల్లమాడ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుమాల ఎస్సీ కాలనీలో ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి మానవ హక్కుల పరిరక్షణపై ట్రైనీ ఎస్ఐ చెన్నయ్య శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాల వారు పిల్లలను బాగా చదివించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఎంసీ నాయకులు, లాయర్ వీరనారా యణ, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, వీఆర్ఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి నిల్వతో దోమల బెడద

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనగలూరు అంబేడ్కర్ కాలనీలో మురుగు నీటి నిల్వలను తొలగించి, దోమల బెడద నుంచి ప్రజలను కాపాడాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కదిరెప్ప అధికారులను కోరారు. ఆయన శుక్రవారం మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ... ఇటీవల కురిసిన వర్షాల కారణంగా అంబేడ్కర్ కాలనీలో మురుగు నీటి నిల్వలు ఏర్పడ్డాయన్నారు. వాటి తీవ్ర దుర్వాసనతో పాటు దోమలతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు వెంటనే స్పందించి తక్షణం చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

ఇందిరా గాంధీకి ఘన నివాళి



తనకల్లులో నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధర్మవరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ 41వ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం పట్టణంలో జరుపుకున్నారు. ఆ పార్టీ స్థానిక కార్యాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు తుంపర్తి పరమేశ్ మాట్లాడుతూ...ఇందిరాగాంధీ దేశ నిర్మాణంలో చెరగని ముద్ర వేశారన్నారు. అనంతరం ఆమె విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ సాయికృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కేశగాళ్ల వెంకటేశ్, ఎన్ఎస్‌యూఐ నాయకులు సురేశ్, నరేష్, కాంగ్రెస్ నాయకులు ఆనంద్, రాజు, మధు పాల్గొన్నారు.

● తనకల్లు: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం తనకల్లులో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె ఆశయ సాధన కోసం కృషి చేస్తామని ఆ పార్టీ మండల కన్వీనర్ పారేశు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకుడు నరసింహులు, రామచంద్ర, గంగులప్ప, రమణమ్మ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జయంతి వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు

- విద్యుత్ పనులలో నిమగ్నమైన సిబ్బంది
- డ్రైనేజీ వ్యవస్థకు మరమ్మతులు



విద్యుత్ పనులు చేస్తున్న సిబ్బంది

పుట్టపర్తి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి ఉత్సవాలకు జిల్లా కేంద్రంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు ముమ్మరంగా చేపట్టారు. అందులో భాగంగా ప్రధాన వీధుల్లో విద్యుత్ శాఖ అధికారులు కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నా రు. గురువారం, శుక్రవారం స్థానిక గోపురం రోడ్డులో విద్యుత్ సిబ్బంది ఎత్తైన విద్యుత్ స్తంభాలను ఏర్పాట చేస్తున్నారు. పాత స్తంభాలను తొలగించి కొత్తగా ఎత్తైన స్తంభాలు మార్చే కార్యక్రమం చేపట్టడంతో జిల్లా కేంద్రంలో పగటిపూట విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపివేస్తున్నారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం 6 గంటలైనా విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేశారు. దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. సత్యసాయి జయంతి వేడుకల సందర్భంలోనే కాకుండా ముందస్తుగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి ఉంటే బాగుండేది కదా అని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సత్యసాయి శత జయంతి వేడుకల సందర్భంలోనే ఏదో ఒక మరమ్మతుల పేరుతో విద్యుత్ సరఫరాను నిలిపేస్తుండడం వల్ల ఇబ్బంది పడాల్సి వస్తుందంటూ పలువురు వాపోతున్నారు.

భూగర్భ డ్రైనేజీకి మరమ్మతులు

పట్టణంలోని భూగర్భ డ్రైనేజీ మరమ్మతుల పనుల్లో సిబ్బంది నిమగ్నమయ్యారు. సత్యసాయి జయంతి వేడుకల్లో భూగర్భ డ్రైనేజీలో సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తగా మరమ్మతుల పనులు చేపట్టారు. శుక్రవారం స్థానిక చిత్రావతి రోడ్డులోని చాంబర్‌లను సిబ్బంది శుభ్రం చేశారు. చాంబర్ ఇరుక్కుపోయిన చెత్తను తొలగించారు. తరచూ డ్రైనేజీ పైపులైనలలో అక్కడక్కడ చాంబర్లు చెత్తతో మూసుకు పోయి మురుగునీరు పైకొచ్చేది. గతంలో సత్యసాయి జయంతి వేడుకల్లోనే గోపురం రోడ్డులో డ్రైనేజీ చాంబర్లు పొంగిపొర్లి మురుగునీటితో భక్తులు ఇబ్బంది పడ్డారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగానే డ్రైనేజీ ఛాంబర్‌లన్నింటిలో చెత్తను తీసివేసి పైప్‌లైన్లలో సైతం నీరు సులభంగా పోయేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

రథోత్సవానికి ఇబ్బంది కాకుండా స్తంభాల మార్పు

సత్యసాయి శత జయంతి వేడుకల్లో వేణుగోపాల స్వామి రథోత్సవం నిర్వహణకు ఎలాంటి ఆటంకం ఉండకూడదని ముందస్తుగా పట్టణంలో ఎత్తైన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నాం. ఇందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, దీంతో గతంలో ఉన్న పాత చిన్న విద్యుత్ స్తంభాలను తొలగించి, వాటి స్థానంలో ఎత్తైన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నాం. ఈ పనుల చేపట్టడం వలన కొద్ది రోజులు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుంది. రెండు రోజుల్లో పనులు పూర్తి చేస్తాం.

- సాయినాథ్, విద్యుత్ శాఖ అర్బన్ ఇంజనీరు

'ముస్లింల అభివృద్ధికి ప్రభుత్వం కృషి'



ఎమ్మెల్యే, మాజీ మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ముస్లింలు

కొత్తచెరువు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పేద ముస్లింల అభివృద్ధికి ఎంతో తోడ్పాటు అందిస్తున్నారని, అదే తరహాలో ఎమ్మెల్యే పల్లె సింధురరెడ్డి, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి కృషిచేస్తున్నారని మాజీ సర్పంచ్ మాణిక్యంబాబా పేర్కొన్నారు. హజరత్ మస్తాన్ వలీ దర్గాముతవల్లిగా మాజీ సర్పంచ్ మాణిక్యంబాబాను వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజీజ్ నియమించారు. తన ఎంపికకు కృషిచేసిన వక్ఫ్‌బోర్డు చైర్మన్, డైరెక్టర్లు, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి మాణిక్యంబాబా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే శుక్రవారం మస్తాన్‌వలీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే పల్లెసింధురరెడ్డి, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి చిత్రపటాలకు మాణిక్యం బాబా, ముస్లింలు క్షీరాభిషేకం చేశారు. తనపై నమ్మకంతో ముతవల్లిగా ఎన్నుకోవడంతో మరింత బాధ్యత పెరిగిందని, పేద ముస్లింల అభివృద్ధికి పాటు పడతానని ఆయన తెలిపారు.

శ్రమదానంతో రోడ్డు నిర్మాణం



శ్రమదానం ద్వారా రోడ్డు నిర్మాణం చేపట్టిన గ్రామస్థులు

తనకల్లు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఎవరో వస్తారనీ... ఏదో చేస్తారనీ ఎదురు చూడకుండా మండలంలోని నడిమికుంటపల్లి, రత్నగిరి, సుబ్బరాయనిపల్లి ప్రజలు ఒక్కటయ్యారు. మూడు గ్రామాలలో గ్రామపెద్దల సమక్షంలో సమావేశమై ప్రతి ఇంటి నుంచి ఒక మనిషి, కొంత విరాళం వచ్చేలా తీర్మానించారు. మూడు గ్రామాలలో కలిపి రూ. లక్ష సేకరించారు. ఇంటికి ఒకరు చొప్పున కలిసి, ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌లు అద్దెకు తీసుకున్నారు. నడవడానికి కూడా వీలుకాని రహదారికి శుక్రవారం మట్టిని తోలి బాగుచేసుకున్నారు. తమ రోడ్డును బాగు చేయాలని ఎన్ని మార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. దీంతో శ్రమదానం, విరాళాలతో నడిమికుంటపల్లి వద్ద నుంచి కర్ణాటక సరిహద్దు వరకు రహదారి నిర్మించుకున్నామని వారు అందరికీ చూపించారు. దీంతో మూడు గ్రామాల ప్రజలు మరెందరికో మార్గదర్శకమని పలువురు అభిప్రాయపడ్డారు.

సర్దార్ పటేల్ దేశానికే ఆదర్శం: ప్రిన్సిపాల్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హుస్సేన్

బుక్కపట్నం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి ఆదర్శమని శ్రీ సత్యసాయి ప్ర భుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ పేర్కొన్నారు. ఆ కళాశాల చరిత్ర విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం బుక్కపట్నంలో ఏక్తా దివాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సర్దార్ పటేల్ దేశానికి చేసిన సేవలను కొనియా డారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ఎన్ రవి కుమార్, చరిత్ర అధ్యాపకులు డాక్టర్ రాజమహమ్మద్, తెలుగు అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసులు, నాగేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లపైకి మురుగునీరు.. పట్టించుకోని అధికారులు



రోడ్డుపై నిలిచిన మురుగునీరు

గాండ్లపెంట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పలు వీధులలో రోడ్లపైకి మురుగునీరు వదులుతున్నా పట్టించుకునే అధికారులు కరువయ్యారని దిగువ కాలనీ వాసులు తెలిపారు. మండల కేంద్రంలోని క్వార్టర్స్ సమీపంలో పలు వీధులలో, గంగమ్మ వీధిలోని పలు నివాసాల నుంచి మురుగునీటిని రోడ్లపైకి వదులుతున్నారు. ఆ మురుగునీరు రోడ్లపై నిలవ డం వల్ల దోమల అధికమయ్యాయనీ స్థానికులు వాపోతున్నారు. రోడ్లపై పారుతున్న మురుగు నీటిపైనే వాహనాల రాకపోకలు సాగించడంతో గంగమ్మ వీధిలో ఎగువ కాలనీలో రోడ్లు గుంతలమయమై మురుగునీ రు ఆ గుంతలలో నిలిచిపోతోంది. ఆ వీధిలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలకు విద్యార్థులు ఇదే దారిగుండా వెళ్లాల్సి ఉంది. వారు నిత్యం మురుగునీటిలో నడుచుకుంటూ వెళ్తున్నారు. దీనిపై పంచాయతీ అ ధికారులు స్పందించడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. ఇప్పటికైనా అధికారు లు స్పందించి గుంతలను పూడ్చి సిమెంట్ రోడ్డు వేయాలని, నివాసాల నుంచి మురుగునీరు రాకుండా అరికట్టాలని వారు కోరుతున్నారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం



ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగుమధు

ధర్మవరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కదిరిగేటులో ఉన్న నేతన్న విగ్రహం వద్ద ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ నిరంతరం కృషిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఎర్రంశెట్టి రమణ, సీపీఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ ఆవరణం శుభ్రం



పోలీస్ స్టేషన్ ఆవరణాన్ని శుభ్రం చేసిన అధికారులు

ఆంధ్రజ్యోతి స్పందన

తనకల్లు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో పెరిగి పోయిన పిచ్చిమొక్కలు, కంపలను తొలగించారు. అక్కడ పిచ్చిమొక్కలు, కంపలు పెర గడంతో పాముల సంచారం వల్ల చుట్టుపక్క ల వారు ఇబ్బందులు పడుతున్నట్లు ఆంధ్ర జ్యోతి దినపత్రికలో 'పాముల బెడద' అన్న శీర్షికతో శుక్రవారం కథనం వెలువడిన విష యం విదితమే. ఈ కథనంపై అటు పోలీ సులు, ఇటు గ్రామ పంచాయతీ అధికారులు స్పందించారు. పోలీస్ స్టేషన్ ఆవరణంలో పెరిగిన పిచ్చిమొక్కలు, కంపలను తొలగిం చారు. ఆవరణం శుభ్రం చేశారు. పాడు బడిన క్వార్టర్స్‌ను ఉన్నతాధికారులు అనుమ తితో తొలగించాల్సి ఉందని తెలిపారు. సమస్య పరిష్కారానికి కృషి చేసినందుకు చుట్టుపక్కల ఇళ్ల వారు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్

ఎలుగుబంట్ల సంచారంతో బెంబేలు


భూతప్ప కనుమలో పగటిపూటే సంచరిస్తున్న ఎలుగుబంటి

గుడిబండ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూతప్ప కనుమలో పగటి పూటే ఎలుగుబంట్లు సంచరిస్తుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మండలంలోని మందలపల్లి, పిసిగిరి, భైరేపల్లి, దాసరపల్లి, కరేకెర, కెడిపాల్యం, రామయ్యన, కొంకల్లు, ఎస్ రాయాపురం, పూజారిపల్లి, గుడిబండ, జీఎస్‌తాండా, ఎమ్మెఎస్ తండా, మేకలగట్ట, ఎఎస్ఎస్ గుండ్లు, సంకరగల్లు, రాళ్లపల్లి, ముదిగుబ్బ తదితర గ్రామాలు అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్నాయి. చిరుత పులులు, ఎలుగుబంట్లు అధికంగా ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. నాలుగు నెలల కిందట ఎస్ రాయాపురంలో బూతరాజుపై ఎలుగుబంటి దాడి చేసింది. అలాగే వీరక్యాతప్ప పాడి ఆవుపై చిరుత దాడి చేసింది. గుడిబండలో చిరుత పులల సంచారంతో ప్రజలు రాత్రి పూట బయటకు రావడానికి భయపడుతున్నారు. సంబంధిత శాఖాధికారులు స్పందించి ఎలుగుబంట్లు, చిరుతపులులను బంధించి ఇతర ప్రాంతాలకు తరలించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఏడాది తర్వాత తల్లిదండ్రుల వద్దకు..!

● తప్పిపోయిన బాలుడిని అప్పగించిన పోలీసులు


బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న పోలీసులు

రాయదుర్గం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): గొర్రెలు మేపడం ఇష్టం లేక ఏడాది కిందట పారిపోయిన బాలుడు వడ్డే ఆంజనేయులును పోలీసులు శుక్రవారం అతడి తల్లిదండ్రులకు అప్పగించారు. గుమ్మఘట్ట మండలం గోనబావి గ్రామానికి చెందిన వడ్డే మారెప్ప, వడ్డే ఈరక్కల మూడో కుమారుడు వడ్డే అంజజినేయులు గొర్రెలను మేపడానికి వెళ్తుండేవాడు. చదువుకోవాలనే ఆలోచన ఉన్నప్పటికీ తల్లిదండ్రుల ఒత్తిడి తట్టుకోలేక గొర్రెల వెంట వెళ్లేవాడు. ఈ నేపథ్యంలో విసుగు చెంది గత ఏడాది అక్టోబరు 15న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. కొడుకు ఆచూకీ కోసం అన్ని చోట్లా గాలించిన తల్లిదండ్రులు చివరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై గుమ్మఘట్ట పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. వడ్డే ఆంజనేయులు కోసం అటు కర్ణాటక, రాష్ట్రంతో పాటు సుదూర ప్రాంతాలలో గాలించారు. చివరకు ప్రత్యేక బృందం బెంగళూరు నగరంలో గుర్తించి, బాలుడిని తెచ్చి శుక్రవారం తల్లిదండ్రులకు అప్పగించినట్లు సీఐ వెంకటరమణ తెలిపారు.

రెండు లారీలు ఢీ: డ్రైవర్ మృతి

శింగనమల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి బ్రిడ్జి మీద రెండు లారీలు ఢీ కొనడంతో డ్రైవర్ హరీష్(30) మృతి చెందాడు. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన మేరకు... గురువారం అర్ధరాత్రి అనంతపురం నుంచి ప్రొద్దుటూరుకు వెళ్లేందుకు లారీలో సరుకులు(గూడ్సు) వేసుకుని కనగానపల్లికి చెందిన డ్రైవర్ హరీష్ బయల్దేరాడు. పెరవలి గ్రామ సమీపంలో బ్రిడ్జి మీద తాడిపత్రి నుంచి అనంతపురానికి సిమెంట్ లోడుతో వస్తున్న లారీ ఎదురుగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో గూడ్స్ లారీ నుజ్జై డ్రైవర్ క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయాడు. రోడ్డు ప్రమాదాన్ని స్థానికులు, వాహనదారులు గమనించి ఎక్స్‌కవేటర్ ద్వారా క్యాబిన్‌ను తొలగించి డ్రైవర్‌ను కాపాడే ప్రయత్నం చేశారు. అయితే తీవ్రంగా గాయపడిన డ్రైవర్ హరీష్ అప్పటికే మృతి చెందాడు మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. శింగనమల పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బొలెరో బోల్తా.. ఒకరి మృతి


గొల్ల రాజన్న (ఫైల్)

కళ్యాణదుర్గం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోళ్ల గ్రామం వద్ద శుక్రవారం బొలెరో బోల్తా పడి మేకల రాజన్న(45) అనే వ్యక్తి మృతిచెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. శెట్టూరు మండలానికి చెందిన ఏడుగురు కూలీలు పుచ్చకాయల పంట కోత కోసం పామిడికి వెళ్లి, తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. గోళ్ల ఆంజనేయస్వామి గుడి వద్ద టైరు పేలి వాహనం బోల్తా పడిందని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో రాజన్న అక్కడికక్కడే మృతి చెందారు. శివకృష్ణ, మంజు, శంకర తీవ్రంగా గాయపడ్డారు. వీరిని కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మేకల రాజన్నకు భార్య సావిత్రమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈకేవైసీ గడువు పొడిగింపు

అనంతపురం అర్బన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అక్రమాలను నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్)ను అమలు చేయనుంది. ఇందుకోసం అక్టోబరు 1 నుంచి ఉపాధి కూలీలతో ఈకేవైసీ చేయడం మొదలు పెట్టింది. ఈ విధానంలో ఉపాధి కూలీల ఐరిస్ ఫొటో తీసుకొని యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. అక్టోబరు నెలాఖరులోగా ఈకేవైసీ పూర్తి చేయాలని గడువు విధించారు. నవంబరు 1 నుంచి నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్) విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. అయితే సర్వర్ సమస్యతో గడువులోగా ఈకేవైసీ పూర్తి చేయకపోయారు. క్షేత్ర స్థాయిలో నెలకొన్న సమస్యలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం మరో వారం రోజులు గడువు పొడిగించింది. జిల్లా వ్యాప్తంగా 542526 మంది ఉపాధి కూలీలు ఉండగా.. ఇప్పటి దాకా 388013 మందికి (71.52 శాతం) ఈకేవైసీ పూర్తి చేశారు. ఇంకా 154513 మందికి ఈకేవైసీ పెండింగ్‌లో ఉంది. పొడిగించిన గడువులోగా ఉపాధి కూలీలందరితో ఈకేవైసీ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ సలీం బాషా పేర్కొన్నారు.

ఉచితంగా ట్యాలీ శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు బెంగళూరులో ఉచితంగా ట్యాలీ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు ఉన్నతి ఫౌండేషన్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా చదివి 18-28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై అత్యుత్తమ శిక్షణ ఇస్తామన్నారు. ఈనెల 10 నుంచి 35రోజుల పాటు బెంగళూరులో ఇచ్చే ఉచిత శిక్షణలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం ఆయా సంస్థలలో ఉద్యోగ అవకాశం కల్పిస్తామని తెలిపారు. వివరాలకు సెల్ నంబరు 9000487423ను సంప్రదించాలని కోరారు.

అవగాహన పెంచుకోండి: డీఆర్‌డీఏ పీడీ

● 'మన డబ్బులు - మన లెక్కలు'పై సీసీలకు శిక్షణ

అనంతపురం అర్బన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మన డబ్బులు - మన లెక్కలుకు సంబంధించిన మొబైల్ బుక్ కీపింగ్‌పై అవగాహన పెంచుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శైలజ సూచించారు. శుక్రవారం స్థానిక ప్రశాంతి జిల్లా సమాఖ్య కార్యాలయంలో మన డబ్బులు - మన లెక్కలపై ఎంపిక చేసిన సీసీలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మన డబ్బులు - మన లెక్కలకు సంబంధించిన మొబైల్ యాప్‌లో వివరాలు ఎలా నమోదు చేయాలి, తదితర అంశాలపై సంపూర్ణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీడీ రాధారాణి, ఐబీ డీపీఎం రాజ్యలక్ష్మి, ఏపీఎం భాస్కర్‌నాయుడు, ఐటీ యాంకర్ చంద్రదర్ తదితరులు పాల్గొన్నారు.

భాషపై పట్టు సాధించండి

● జిల్లా ప్రధాన న్యాయాధికారి భీమారావు సూచన
● విజయనగర లా కళాశాలలో గేట్ వే సెలబ్రేషన్స్ న్యూవేవ్


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి భీమారావు

అనంతపురం రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రతి న్యాయ విద్యార్థి భాషపై పట్టు సాధించాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి భీమారావు అన్నారు. విజయనగర లా కళాశాల నూతన విద్యా సంవత్సర ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని గేట్ వే సెలబ్రేషన్స్ న్యూవేవ్ పేరిట శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయాధికారి భీమారావు, జిల్లా అదనపు కోర్టు న్యాయాధికారి సత్యవాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన విషయ పరిజ్ఞానంతోపాటు అవసరానికి అనుగుణంగా అవతలి వ్యక్తికి అర్థమయ్యేలా చెప్పటం ఎంత అవసరమో ఉదాహరణలతో విద్యార్థులకు వివరించారు. వినియోగించే ప్రతి పదానికి అర్థాలు, నానార్థాలు తెలుసుకోవడంతో పాటు తమ జ్ఞానాన్ని ఎక్కడ ఏ సందర్భంలో ఎలా వినియోగించాలో వంటి లౌకిక జ్ఞానం అవసరమని తెలిపారు. జిల్లా అదనపు కోర్టు న్యాయాధికారి సత్యవాణి మాట్లాడుతూ న్యాయ విద్యార్థిగా ప్రారంభమైన చదువు న్యాయవాది అయిన తరువాత కూడా కొనసాగితేనే సమర్థవంతంగా న్యాయసేవలు అందించగలుగుతారన్నారు. ప్రస్తుతం న్యాయ విద్యార్థులకు ఎన్నో సదుపాయాలు, వృత్తిలో మెరుగైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు రామిరెడ్డి, కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ రాఘవేంద్రచార్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు జరిగితే కఠిన చర్యలు: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాల్య వివాహాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆనంద్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో బాల్య వివాహ నిరోధక సమన్వయ కమిటీ/మిషన్ శక్తి జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... బాల్యవివాహాలు, మానభంగం, ఉమెన్ ట్రాఫికింగ్, గృహహింస, వేధింపుల కేసులకు సంబంధించి వన్ స్టాప్ సెంటర్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, పోలీస్ వారు కలిసికట్టుగా పని చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. బాల్య వివాహాలపై సచివాలయాల వారిగా అందరికీ అవగాహన కల్పించాలన్నారు. టీనేజ్ ప్రెగ్నెన్సీలు రాకుండా చూసుకోవాలని, ఆదేశించారు. బాలికలు 10రోజుల పాటు పాఠశాలలకు రాకపోతే అంగన్‌వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్లు వారి ఇంటి వద్దకెళ్లి కారణాలు ఆరాతీయాలన్నారు. జిల్లాలో సెప్టెంబరు నుంచి ఇప్పటివరకు 13 బాల్యవివాహాలు నమోదు కాగా, ప్రతి కేసు లోనూ బైండోవర్స్ జరగాలని డీపీఓని ఆదేశించారు. సమావేశంలో జిల్లా లీగల్ అథారిటటీ సర్వీసెస్ సెక్రటరీ రాజశేఖర్, ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి, డీఎంహెచ్ఓ ఈబీ దేవి, డీసీఓ మంజునాథ్, జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్, డీఈఓ ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

అండర్-14 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): అండర్-14 జిల్లా బాలుర క్రికెట్ జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన జట్టు వివరాలను స్థానిక ఆర్డీటీ స్టేడియంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి శుక్రవారం వెల్లడించారు. జట్టులో బురానుద్దీన్, హేమచంద్ర నాయక్, ఆహిల్‌రాజా, పంకజ్ మీనా, ప్రాణధీర్, మోక్షన్‌తేజ్, కుశ్వంత్ సాయికృష్ణ, రాహిత్ రెడ్డి, కృతిక్‌సాయి, మన్నన్, గౌతమ్ ఆదిత్య, జస్వంత్‌సాయి, దేవస్కంద, రోహితేశ్వర్ రాజ్, తెన్డ్రిక్ విక్రాంత్, రోహిత్ ఉన్నారు. కోచ్‌గా అహ్మద్‌రఫీని నియమించారు. ఈ జట్టు శనివారం నుంచి కడపలో జరిగే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొంటుందన్నారు.

రైల్వే అభివృద్ధికి ప్రధాని కృషి


మాట్లాడుతున్న రైల్వే అధికారి

గుత్తి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దేశ అభివృద్ధికి మూల స్తంభమైన రైల్వే శాఖ సమగ్ర అభివృద్ధి కోసం ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని రైల్వే శాఖ కమర్షియల్ ఇన్స్‌పెక్టర్ హోనుక్ కుమార్, రైల్వేస్టేషన్ మేనేజర్ సురేష్‌బాబు, ఐఓడబ్ల్యు నాగేశ్వర్ నాయక్ అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో స్టేషన్ మేనేజర్ కార్యాలయంలో శుక్రవారం అమృత్ సంవాద్ 5.0 పథకం గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. డివిజన్‌లో ప్రధానమైన గుత్తి రైల్వే జంక్షన్‌ను అభివృద్ధిపరిచేందుకు ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ప్రయాణికులు సౌకర్యార్థం స్టాల్స్, క్రీడా సౌకర్యాలు తదితర వాటిని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. సమావేశంలో రైల్వే జంక్షన్ అభివృద్ధి కమిటీ సభ్యులు విజయ్‌భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా లీజు ప్రాంతాల హద్దుల గుర్తింపు


పాయింట్‌ను గుర్తిస్తున్న బృందం

రాయదుర్గం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): డి.హీరేహాళ్ మండలంలోని ఇనుప గనుల కొండల్లో లీజుప్రాంతాల హద్దుల గుర్తింపు ప్రక్రియ శుక్రవారం చురుకుగా సాగింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో రెండురోజులుగా జరుగుతున్న పనులు శుక్రవారం కూడా కొనసాగాయి. అటవీశాఖ, మైన్స్ అండ్ జియాలజీతో పాటు ల్యాండ్ రెవెన్యూ అధికారులు సంయుక్తంగా పర్యటించి ఆరు మైనింగ్ లీజుల ప్రాంతాల హద్దులను గుర్తించారు. ఓఎంసీతో పాటు వైఎం, ఏఎంసీ, బీఐటీపీ లీజులకు సంబంధించి జీపీఎస్ పాయింట్లను గుర్తించి, రాళ్లను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా లీజు ప్రాంతాల్లో కేటాయింపుల్లో కాకుండా ఇతరత్రా ప్రాంతాల్లో తవ్వకాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డ్రోన్ల ద్వారా సర్వే నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను సిద్ధం చేశారు. కార్యక్రమంలో మైన్స్ జియాలజీ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, సర్వే రీజనల్ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, సర్వే ల్యాండ్ రికార్డ్ అధికారి రూప్లానాయక్, డీఎఫ్ఓ గురుప్రభాకర్, సర్వేయర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు ఆర్మీ కమాండర్


కమాండర్ దంపతులను సన్మానిస్తున్న వేద పండితుడు

తాడిపత్రి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుగ్గరామలింగేశ్వర స్వామి, చింతల వెంకటరమణ స్వామి, సంజీవనగర్ షిర్డిసాయిబాబా ఆలయాలను ఆర్మీ కమాండర్ అలోక్ త్రిపాఠి దంపతులు శుక్రవారం సందర్శించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయాల విశేషాల గురించి వేద పండితులను అడిగి తెలుసుకున్నారు.

ఏడు రోజుల్లో 114 బస్సుల తనిఖీ: డీటీసీ


మాట్లాడుతున్న డీటీసీ వీర్రాజు

అనంతపురం టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): గత ఏడు రోజుల్లో 114 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేసినట్లు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వీర్రాజు వెల్లడించారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాద ఘటన నేపథ్యంలో గత ఏడు రోజులుగా బస్సులను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. సీట్ ఆల్ట్రేషన్, ఫైర్ డిటెక్షన్ అలారమ్, అగ్ని ప్రమాద నియంత్రణ పరికరాలు, ఎమర్జెన్సీ ఎగ్జిట్ పనితీరు వంటి అంశాలను తనిఖీల్లో పరిశీలించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో 49 బస్సులపై కేసులు నమోదు చేశామన్నారు. రోడ్డు భద్రత నియమాలకు విరుద్ధంగా నడుపుతున్న రెండు బస్సులను సీజ్ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని స్కూల్, కాలేజీల బస్సులను తనిఖీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని, శనివారం నుంచి పది రోజులపాటు స్కూల్, కాలేజీ బస్సులతో పాటు అన్నిరకాల బస్సులను తనిఖీ చేస్తామన్నారు.

పొగాకుకు దూరంగా ఉండాలి: డీఈఓ

అనంతపురం విద్య, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పొగాకు వినియోగానికి ప్రతిఒక్కరు దూరంగా ఉండాలని డీఈఓ ప్రసాద్ బాబు సూచించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం పొగాకు అనర్థాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా పొగాకుకు అందరూ దూరంగా ఉండాలని కోరుతూ తమ శాఖ అధికారులు, ఉద్యోగులతో డీఈఓ ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పొగాకు అనర్థాలపై ఇతరులకు అవగాహన కల్పించాలని కోరారు. అలాగే పాఠశాలల సమీపంలో పొగాకు వస్తువులు అమ్మడం చట్టవ్యతిరేకమని, అలా ఎక్కడైనా అమ్మకాలు చేస్తుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టరు నారాయణస్వామి, విద్యా శాఖ ఏడీలు మునీర్, శ్రీనివాసులు, సూపరింటెండెంట్లు ఆదినారాయణ, లక్ష్మీనారాయణ, సామాజిక కార్యకర్త శ్రీరాములు, ఇతర విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.


పొగాకు వద్దు అంటూ ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఈఓ

దేశానికే ఏపీ రోల్‌మోడల్

● కాలుష్య నియంత్రణ బోర్డు చైర్మన్ కృష్ణయ్య

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సర్క్యులర్ ఎకానమీ వేస్ట్ రీసైక్లింగ్ పాలసీని అమలు చేయడంలో దేశానికి మన రాష్ట్రం రోల్‌మోడల్‌గా నిలవనుందని కాలుష్య నియంత్రణ బోర్డు చైర్మన్ కృష్ణయ్య తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సర్క్యులర్ ఎకానమీ వేస్ట్ రీసైక్లింగ్ పాలసీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్ర వ్యాప్తంగా సర్క్యులర్ ఎకానమీ వేస్ట్ రీసైక్లింగ్ పాలసీని క్రమపద్ధతిలో అమలు చేయాలన్నారు. డీఆర్‌డీఏ, ఉద్యానశాఖ, స్వచ్ఛందసంస్థల సహకారంతో వ్యర్థాల నిర్వహణలో ఉపాధి కల్పన కోసం కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై ఉక్కుపాదం మోపాలన్నారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ పారిశ్రామిక వాడల వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీలలో ఉత్పత్తి చేసే ఘన వ్యర్థాలను, సిమెంట్ బట్టీలలోని వ్యర్థాలను కోప్రాసెసింగ్ ద్వారా రీసైక్లింగ్ చేయడమే ప్రధాన లక్ష్యమన్నారు. అనంతరం సర్క్యులర్ ఎకానమీ వేస్ట్ రీసైక్లింగ్ పాలసీ పోస్టర్లు ఆవిష్కరించారు. డీఆర్ఓ మలోలా, డీఆర్‌డీఏ పీడీ శైలజ, కాలుష్యనియంత్రణ మండలి ఈఈ కిషోర్ కుమార్ రెడ్డి, ఈఏ కృష్ణారెడ్డి, పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాస్ యాదవ్, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చైర్మన్ కృష్ణయ్య, కలెక్టర్ ఆనంద్ తదితరులు


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అహుడా చైర్మన్ టీసీ వరుణ్

ఈ-వేలంలో లబ్ధిదారుల ఎంపిక

● అహుడా చైర్మన్ టీసీ వరుణ్

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అహుడా ఎన్టీఆర్ స్మార్ట్ లేఅవుట్లలో అవకతవకలకు చోటు లేకుండా ఈ-వేలం ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని అహుడా చైర్మన్ టీసీ వరుణ్ తెలిపారు. స్థానిక అహుడా కార్యాలయంలో శుక్రవారం ఆయన వైస్ చైర్మన్, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీసీ వరుణ్ మాట్లాడుతూ ఒక కుటుంబానికి ఒక ప్లాట్ నిబంధనను అహుడాలో సవరిస్తూ, ఆసక్తి ఆర్థిక స్తోమత ఉన్న వారు ఎన్ని ప్లాట్లు అయినా కొనుగోలు చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నామని తెలిపారు. అహుడా పరిధిలోని ఎన్టీఆర్ లేఅవుట్లలో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామన్నారు. త్వరలో అహుడా అధికారిక వెబ్‌సైట్ ప్రారంభిస్తామని తెలిపారు. సమావేశంలో అహుడా సెక్రటరీ రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ ఆఫీసర్ కేఎండి ఇషాక్, జేపీఓ హరీష్‌చౌదరి, ఈఈ దుష్యంత్, డీఈ రేవంత్, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఏఈ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పది రోజుల్లో ఖాతాల్లోకి కూలి డబ్బు: పీడీ


ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ సలీంబాషా

గార్లదిన్నె, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): 'ఉపాధి హామీ పథకం కూలీలు ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదు. పది రోజుల్లో ఖాతాల్లోకి కూలి డబ్బులు జమ అవుతాయి' అని డ్వామా పీడీ సలీం బాషా పేర్కొన్నారు. మండలంలోని పెనకచెర్ల, డ్యాం గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేసిన కందకాలు, ఇంకుడు గుంతలు తవ్వకం తదితర పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. చేసిన పనికి కూలి డబ్బులు పడటం లేదని పలువురు కూలీలు ఆయన వద్ద వాపోయారు. దీంతో త్వరలోనే మీ బ్యాంకు ఖాతాల్లోకి కూలి డబ్బు జమ అవుతుందని పీడీ వారికి భరోసా ఇచ్చారు. అనంతరం ఇంకుడు గుంతల ప్రయోజనం గురించి రైతులను ప్రశ్నించి, సమాధానాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఏపీఓ ఓబన్న, టెక్నికల్ అసిస్టెంట్ వనం రామాంజినేయులు, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరిగా రూ.10వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 50 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

ఓటీపీఆర్ఐలో ప్రాంగణ నియామకాలు

అనంతపురం రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏ అనుబంధ కళాశాల ఓటీపీఆర్ఐ(తైల సాంకేతిక, ఔషధ పరిశోధన సంస్థ)లో ప్రాంగణ నియామకాలు చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన దివీస్ లేబొరేటరీస్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రాంగణ నియామకాల ఇంటర్వ్యూలు నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ ఆచార్య జీవీ సుబ్బారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అక్టోబరు నెలలో దివీస్ లేబొరేటరీస్ వారు రాష్ట్ర వ్యాప్తంగా ప్రాంగణ నియామకాల ప్రణాళికను విడుదల చేశారన్నారు. ఈనేపథ్యంలో తమ సంస్థ నుంచి 45మంది ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. సంస్థ మానవ వనరుల విభాగానికి చెందిన ప్రతాప్, శ్రీహరి 25మంది విద్యార్థులకు లిఖిత పూర్వక, మౌఖిక పరీక్షలను నిర్వహించారన్నారు. ఇందులో 20మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోపీనాథ్, ఓటీపీఆర్ఐ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ మహేష్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

వైభవంగా నాగుల ప్రతిష్ఠ



నాగుల ప్రతిష్ఠ చేస్తున్న అర్చకులు

హిందూపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డ్వాక్రా కాలనీలో నాగులప్రతిష్ఠను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేద మంత్రాలతో హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగుల విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ చేసి అర్చన, అభిషేకాలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ రమేష్, టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్, పీఏ బాలాజీ, కౌన్సిలర్ భారతి, హరి, చంద్ర పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీదేవి విగ్రహ ప్రతిష్ఠాపన



గుడిబండ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన హరి అర్జీహళ్లి గ్రామంలో లక్ష్మీదేవి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో భాగంగా వేద పండితుల మంత్రోచ్చారణలతో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

సమస్యలను పరిష్కరించండి..!



మంత్రి సవితకు వినతిపత్రం ఇస్తున్న మైనార్టీ నాయకులు

పెనుకొండ టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు సమస్యలపై మంత్రి సవితకు వినతులు అందించారు. శుక్రవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో మైనార్టీ నాయకులు, పలువురు స్థానికులు మంత్రిని కలిసి విన్నవించారు. ఆమె స్పందిస్తూ పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

నేడు మంత్రి పర్యటన: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో శనివారం మంత్రి సవిత పాల్గొనున్నారు. దర్గా ప్రాంతంలో మంత్రి పాల్గొంటారని, రూ.15లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం ఉంటుందని పట్టణ కన్వీనర్ శ్రీరాములు తెలిపారు.

సమస్యలను పరిష్కరించడమే లక్ష్యం

● నగరపంచాయతీ చైర్మన్ నరసింహరాజు



మాట్లాడుతున్న చైర్మన్ నరసింహరాజు

మడకశిరటౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో ప్రతి సమస్య పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని చైర్మన్ నరసింహరాజు అన్నారు. శుక్రవారం నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ ప్రజలు కూడా పట్టణ అభివృద్ధికి సహకరించాలన్నారు. కాలనీల్లో పర్యటిస్తూ అధికారులు ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. తాగునీరు, పారిశుధ్య, ప్రధాన సమస్యలపై చర్చించారు. పట్టణ అభివృద్ధి కోసం రోడ్లు, కాలువల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, త్వరలో ఏఏ వార్డుల్లో ఎలాంటి పనులు చేపడతామన్న విషయాలను వెల్లడిస్తామన్నారు. కమిషనర్ పగడాల జగన్నాథ్, వైస్‌చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, మేనేజర్ చంద్రమౌళి, ఏఈ మురళీధర్ పాల్గొన్నారు.

కెనరా బ్యాంకులో సంబరాలు

రొద్దం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా కెనరాబ్యాంక్‌లో త్రైమాసిక ఆదాయం రూ.4774కోట్లు ఆదాయం రావడంపై స్థానిక ఆ బ్యాంకులో సిబ్బంది సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం బ్యాంకు మేనేజర్ సురేష్ ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి కస్టమర్లకు పంచి పెట్టారు. బ్యాంకు జూలై, ఆగస్టు, సెప్టెంబరు మాసాలకు రూ.4774 కోట్లు ఆదాయం వచ్చినట్లు మేనేజర్ వివరించారు. కస్టమర్లే దేవుళ్లని కొనియాడారు. ఏఈఓ వినయ్‌కుమార్, సన్ని, ఇమ్రాన్, ఆదెప్ప, గంగరత్నమ్మ, సూర్యప్రకాశ్, గోవిందు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు

సోమందేపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు శుక్రవారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వైద్యులు ఓంకార్ ఆధ్వర్యంలో కంటివైద్యులు రామ్మోహన్ 908 మందిని పరీక్షించగా 23మందికి కంటి అద్దాలకు సిఫార్సు చేశారు. రాష్ట్రీయ బాల ట్రస్ట్ కార్యక్రమం కింద కంటి పరీక్షలు నిర్వహించినట్లు వారు తెలిపారు. సూపర్‌వైజర్ రవీంద్ర, సిబ్బంది జరీన్‌తాజ్, రాజశేఖర్, నాగరత్న, అశ్వత్థమ్మ పాల్గొన్నారు.

క్రీడా పోటీల విజేతలు వీరే..



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెనుకొండ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న అండర్-14, అండర్-17 డివిజన్‌స్థాయి బాల బాలికల క్రీడా పోటీలు శుక్రవారం కొనసాగాయి. బాలికల వాలీబాల్ విజేత అమరాపురం, రన్నర్స్‌గా పరిగి, బాలుర కబడ్డీ పోటీల విజేతగా లేపాక్షి, రన్నర్స్ చిలమత్తూరు నిలిచాయి. పోటీల్లో 12మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా పాఠశాల హెచ్‌ఎం రాఘవయ్య, నాగార్జున, ఎంఈఓ సుధాకర్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, డివిజనల్ కోఆర్డినేటర్ నాగభూషణం పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

అమరాపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్నడుగు గ్రామ శివారులో తనిఖీలు చేపడుతుండగా కర్ణాటకకు అక్రమంగా రవాణా అవుతున్న రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. అనంతపురం ప్రాంతీయ అధికారి ప్రసాద్ ఆదేశాల మేరకు విజిలెన్స్ సీఐ సద్గురుడు, రవీంద్రనాథ్, సీఎస్‌డీటీ నవీన్‌కుమార్ తనిఖీ నిర్వహిస్తుండగా కర్ణాటకకు రేషన్ బియ్యం తరలిస్తున్న ఐచెర్ వాహనం పట్టుబడిందన్నారు. ఇందులో 346బ్యాగుల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సీతాఫలాలతో కూలీలకు ఉపాధి

● కొండల నుంచి తెచ్చి పట్టణాల్లో విక్రయం



మార్కెట్ సౌకర్యం లేక రోడ్డుపైనే అమ్మకాలు చేస్తున్న కూలీలు

మడకశిర రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మడకశిర ప్రాంతంలో కొండలు,గుట్టలు అధికంగా ఉన్నాయి. వాటిలో ఎక్కువగా సీతాఫలం చెట్లు ఉండడంతో ప్రతి ఏడు మూడు నెలల పాటుకు సీతాఫలాల అమ్మకంతో కూలీలు ఉపాధి పొందుతున్నారు. మండలంలో కదిరేపల్లి, గుర్రపుకొండ, ఉగ్రేపల్లి, ఏఆర్ రొప్పం, హెచ్‌ఆర్ పాళ్యం, బేగార్లపల్లి, గుండమల, మెళవాయి, ఆమిదాలగొంది, ఎగువ రామగిరి, దిగువ రామగిరి తదితర గ్రామాల సమీపంలో కొండలు, గుట్టలు అధికంగా ఉన్నాయి. వాటిలో లభించే సీతాఫలం పండ్ల కోసం సమీప గ్రామాల్లోని కూలీలు ఉదయాన్నే వెళ్లి కోసుకొచ్చి వాటిని పట్టణానికి తీసుకెళ్లి అమ్మి ఉపాధి పొందుతున్నారు. మూడు నెలలు పాటు వీటివల్ల కూలీలకు ఉపాధి లభిస్తోంది. మడకశిర ప్రాంతంలో లభించే సీతాఫలాలు ఎంతో రుచికరంగా ఉండడంతో కర్ణాటక రాష్ట్రం బెంగళూరు, తుమకూరు, మధుగిరి తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు ఇక్కడి వచ్చి సీతాఫలాలను కొనుగోలు చేస్తుంటారు. సీతాఫలం పండ్లకు ఇక్కడ మంచి డిమాండ్ ఉంది.

మార్కెట్ సౌకర్యం కల్పించాలి

మడకశిర ప్రాతంలో సీతాఫలం పండ్లకు మంచి గిరాకీ ఉంది. మార్కెట్ సౌకర్యం లేక రోడ్డుపైన, బస్టాండ్ ప్రాంతాల్లో అమ్ముకోవాల్సి వస్తోందని కూలీలు అంటున్నారు. మూడు నెలలు పాటు ప్రభుత్వం మార్కెట్ సౌకర్యం కల్పించాలన్నారు. కోసిన పండ్లను వ్యయప్రయాసల కోర్చి పట్టణానికి తీసుకెళ్లాల్సి వస్తోందన్నారు. దీంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. గ్రామాల్లో స్థానికంగానే మహిళా సంఘాల ద్వారా వాటిని కొనుగోలు చేసే ఏర్పాటు చేయాలని కూలీలు కోరుతున్నారు.

పౌరహక్కులపై అవగాహన

సోమందేపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): గోరంట్ల మండలం పాలసముద్రంలో శుక్రవారం పౌరహక్కులపై తహసీల్దార్ మారుతి అవగాహన కల్పించారు. ఆర్టీటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో దళిత హక్కులు, చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు చంద్ర పాల్గొన్నారు.

ఆలయానికి విరాళాల వెల్లువ

హిందూపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐదులాంతర్ల సర్కిల్‌లో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి పలువురు విరాళాలు ప్రకటించారు. బెంగళూరుకు చెందిన బెలగోడు అశోక్ రూ.లక్ష, పట్టణానికి చెందిన అంజన్‌బాబు రూ.51వేలు, తాతాప్రమథనాథ్ కుమారుడు తాతా కృపాల్ ఆలయ శాశ్వత సభ్యత్వం కోసం రూ.2లక్షలు అందించారు.

ఏకాగ్రతతో చదివితే.. ఉత్తమ మార్కులు

హిందూపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఏకాగ్రత, క్రమశిక్షణతో చదివితే ఉత్తమ మార్కులు సాధించవచ్చని వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు తెలిపారు. శుక్రవారం పాంచజన్య పాఠశాలలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ 9, 10తరగతులు చదువుతున్న విద్యార్థులు అంకితభావంతో అకుంటిత దీక్షతో చదవాలన్నారు. పాఠశాల అధ్యక్షుడు శ్రీనివాసులు, కరస్పాండెంట్ నందకుమార్, హెచ్‌ఎం గాయిత్రి, ఏఓ విజయభాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

మడకశిర రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆమిదాలగొంది పంచాయతీ ఎగువ రామగిరి గ్రామంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి శనివారం పర్యటించనున్నట్లు మండల కన్వీనర్ నాగరాజు తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొంటారన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బైక్ బోల్తా.. ఒకరి మృతి

సోమందేపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పందిపర్తి గ్రామ సమీపంలో బైక్ బోల్తాపడిన ఘటనలో రైల్వే ఉద్యోగి వెంకటరామిరెడ్డి(40) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు గేట్ కీమెన్‌గా పనిచేస్తున్న వెంకటరామిరెడ్డి రాత్రి విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై స్వగ్రామమైన పందిపర్తికి ద్విచక్రవాహనంలో బయలుదేరారన్నారు. మార్గమధ్యంలో కుక్క అడ్డుగా రావడంతో అదుపుతప్పి బోల్తాపడి అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ దేవానంద్ తెలిపారు.

14 మంది బైండోవర్

రొళ్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం 14మంది నిందితులను ఎక్సైజ్ కేసులో ఎక్సైజ్ సీఐ మురళికిషోర్ ఆధ్వర్యంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గిరియప్ప ముందు బైండోవర్ చేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కన్నేనాయక్, కానిస్టేబుల్ మల్లికార్జున పాల్గొన్నారు.

రొద్దం ఎస్ఐగా వీరాంజనేయులు

రొద్దం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రొద్దం ఎస్ఐగా వీరాంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించగా ఏఎస్ఐ సురేంద్రనాథ్, జమేదార్ కాంతప్ప, సిబ్బంది జనార్దన్, పోతన్న పుష్పగుచ్ఛ అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈయన రొళ్ల నుంచి రొద్దంకు బదిలీకాగా ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ నరేంద్ర కర్నూలుకు బదిలీపై వెళ్లారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

టీడీపీ కార్యకర్త మృతి

రొద్దం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త హనుమంతప్ప (68) అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందాడు. శుక్రవారం స్వగృహంలో ఆయన మృతిచెందాడు. టీడీపీ అభివృద్ధికి ఏళ్లుగా కృషిచేశారు. ఆయన మృతి టీడీపీకి తీరనిలోటని మాజీ సర్పంచులు మనోహర్, నాగభూషణం, కోళ్ల శ్రీనివాసులు అన్నారు. హనుమంతప్ప మృతదేహం వద్ద వారు నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

అగళి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): డివిజన్‌స్థాయి నుంచి జిల్లాస్థాయి పోటీలకు అగళి ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ విజయ్‌కుమారి, పీడీ నారాయణస్వామి తెలిపారు. డివిజనల్ స్థాయి పెనుకొండలో జరిగిన చెస్, బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలలో జయంత్, బాలకృష్ణతేజ్, హృదయచంద్ర, ప్రశాంతి ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, పీడీలు అభినందించారు.

శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి

మడకశిర రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలని ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుబ్బయ్య సూచించారు. శుక్రవారం మండలంలోని కేఎస్ తండా, సీఎం తండా, ఎస్‌ఎన్ తండాలో సాగుచేసిన వరి, వేరుశనగ పొలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్తల సలహాలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. మండల వ్యవసాయ అధికారి తిమ్మప్ప, రేతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయండి



మంత్రులకు వినతిపత్రం ఇస్తున్న బాలకృష్ణ

సోమందేపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): గోరంట్లలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని టీడీపీ మండల కన్వీనర్ గుత్తా బాలకృష్ణ చౌదరి, నిమ్మల శ్రీధర్, రెవెన్యూ స్టాంపులు సబ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. టీడీపీ పార్టీ కార్యాలయానికి వచ్చిన మంత్రి సవిత, మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి స్థానిక సమస్యలపై అర్జీలను సమర్పించారు.

ఆరోగ్య ఉప కేంద్రం ప్రారంభం



ఆరోగ్యకేంద్రం ప్రారంభోత్సవంలో నాయకులు, వైద్యులు

పరిగి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా వసతిగృహం సమీపంలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఆరోగ్య ఉప కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. వైద్యులు స్వరూపరెడ్డి మాట్లాడుతూ ఎంతోకాలంగా మండల కేంద్రంలో ఆరోగ్య ఉప కేంద్రం లేకపోవడంతో ప్రజలు, విద్యార్థులు దూర ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు వెళ్లేవారన్నారు. ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసుకునేందుకు సహకరించిన మంత్రి సవితకు కృతజ్ఞతలు తెలిపారు. వైద్యులు నవీన, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, సర్పంచ్ బాలాజీ, తెలుగు యువత జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, సోమప్ప, వెంకటేశ్, సంజీవప్ప, శివశంకర్, ప్రిన్సిపాల్ రమాదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టిప్పర్లకు బ్రేకులు లేవు.. జాగ్రత్తగా ఉండండి



మాట్లాడుతున్న జేడీఎస్ నాయకులు

పావగడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): హెచ్‌వీవీ టిప్పర్లకు బ్రేకులు లేవని జేడీఎస్ నాయకులు జాగ్రత్తగా ఉండాలని కాంగ్రెస్ ఏజెంట్లు జేడీఎస్ రైతుమోర్చా అధ్యక్షుడు గంగాధర్‌నాయుడుకు బెదిరింపు కాల్స్ చేసిన ఉదంతంపై శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. 13న అంబేడ్కర్ సర్కిల్‌లో ఇటీవల నూతనంగా నెలకొల్పిన నందిని డెయిరీలో మాజీ మంత్రి వెంకటరమణప్ప ఫొటోను పెట్టడంపై ప్రభుత్వ స్థలంలో ప్రభుత్వ అనుమతి లేకుండా కేవలం అధికారం ఉందని దర్పంతో టెండర్లు లేకుండా ప్రభుత్వ నందిని డెయిరీని నెలకొల్పారన్నారు. తమకు అధికారం ఉందని జేడీఎస్ పార్టీని టార్గెట్‌గా పెట్టుకుని ప్రశ్నించే తత్వాన్ని అణిచివేయాలనే ఆలోచనలో వారు ఉన్నారన్నారు.

ఎస్సీ స్టేట్ కన్వీనర్‌గా కోర్ట్ నర్సప్ప

పావగడ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఎస్సీ విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా పావగడ పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కోర్టు నర్సప్ప ఎంపికయ్యారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ ధర్మసేన, ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కలిసి కాంగ్రెస్‌లో నరసప్ప చేసిన సేవలను గుర్తించి ఎస్సీ విభాగానికి కన్వీనర్‌గా నియమించినట్లు శుక్రవారం ఆదేశాలు అందాయి.

దహనవాటిక స్థలాన్ని పరిరక్షించండి

పెనుకొండ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైజంక్షన్ వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న పాదబెట్ట జైన దేవాలయానికి చెందిన స్థలం ఆక్రమణకు గురైందని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఆలయ అర్చకుడు అజితప్రసాద్‌జైన్ తహసీల్దార్ స్వాతికి వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ జైనులకు చెందిన పాదబెట్ట కింద ఉన్న భూమి శ్మశానవాటికగా వినియోగిస్తున్నామన్నారు. దానిపక్కన స్థలాన్ని దోబీఘాట్‌గా ఉపయోగిస్తున్నామన్నారు. వీటిపై విచారణ జరిపి చర్యలు తీసుకుని మా భూములకు రక్షణ కల్పించాలని కోరారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం



సోమందేపల్లిలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

సోమందేపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు బాలస్వామి మాట్లాడుతూ 1920 ముంబాయి నగరంలో అక్టోబరు 31న ఏఐటీయూసీ ఆవిర్భవించిందన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు లాలా లజపతిరావు దీనిని ప్రారంభించినట్లు తెలిపారు. ముందుగా జెండా ఆవిష్కరణ చేశారు. రాజగోపాల్, చాంద్‌బాషా, అంజినమ్మ, నారాయణస్వామి, శ్రీకాంత్, అంజనేయులు, బాబాజాన్, ఈడిగ నాగరాజు పాల్గొన్నారు.

పెనుకొండ(ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ 106వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి ఆంజనేయులు హాజరై పతాకావిష్కరణ చేశారు. సీపీఐ శ్రీరాములు, నర్సింహులు, మల్లి, క్రిష్టప్ప, నర్సింహులు, శాంతమ్మ, బావక్క, మహేష్, గజేంద్ర, వినోద్, రాజు పాల్గొన్నారు.

చిలమత్తూరు(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆటో స్టాండులో శుక్రవారం ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తాలూకా ఉపాధ్యక్షుడు ముబారక్ పాషా ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు. సయ్యద్ ఖాజా, చాంద్ బాషా, జాకీర్, జిలాన్, ఖలీమ్ ఉన్నారు.

హిందూపురం(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం హిందూపురంలో ఘనంగా జరుపుకున్నారు. పలుచోట్ల జెండా ఆవిష్కరణ చేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్ మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధనలో ఏఐటీయూసీ విశేష కృషి చేసిందన్నారు. రవికుమార్, మారుతిరెడ్డి, లక్ష్మీనారాయణ, నరేష్, గంగాధర్ పాల్గొన్నారు.



చిలమత్తూరులో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



రక్తదాన శిబిరాన్ని సందర్శిస్తున్న గుండుమల తిప్పేస్వామి

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల

మడకశిర టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని, అవకాశం వచ్చినప్పుడు ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తం అందించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. శుక్రవారం ఫోర్‌వీలర్ అసోసియేషన్ వార్షికోత్సవంలో భాగంగా సాయినగర్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 40 మంది రక్తదానం చేశారు. యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని, ఎంతో మందికి ఆపదలో రక్తం అందించి ఆపదర్భాంధవుల్లా నిలుస్తారన్నారు. రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వారిని అభినందించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, నగరపంచాయతీ చైర్మన్ నరసింహరాజు, ఫోర్ వీలర్ అసోసియేషన్ అధ్యక్షుడు సంజీవ్‌గౌడ్, పట్టణ అధ్యక్షులు నాగరాజు, కౌన్సిలర్ హనుమంతు పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి

పెనుకొండ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో ప్రిన్సిపాల్ సుదర్శన్ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్‌పటేల్ 150వ జయంతిని ఘనంగా నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పటేల్ భారతదేశపు ఉక్కుమనిషి అని, ఉప ప్రధానిగా, హోంశాఖ మంత్రిగా పనిచేశారని వారి సేవలను కొనియాడారు. విద్యార్థులకు వ్యాసరచన, పరుగు పందెం పోటీలు నిర్వహించారు. అధ్యాపకులు బషీర్‌అహ్మద్, ఎంఎస్ మూర్తి, ఎన్ఎస్ఎస్ పీఓలు శ్రీలేఖ, శివన్న, రవికుమార్, ఆర్ఆర్‌సీవీ జయప్రకాశ్, పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పటేల్ జయంతిని పురస్కరించుకుని ఏకతార్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు రామన్న, చంద్రమోహన్, హెచ్‌ఎం మాధవీలత, బీజేపీ వేదవ్యాస్, హనుమంతు పాల్గొన్నారు.

హిందూపురం : సర్దార్ వల్లభాయ్‌పటేల్ 150వ జయంతిని పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ ప్రైవేట్ విద్యా సంస్థల్లో పటేల్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు.